RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 36 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ గురువారం 14-05-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



2వ పేజీలో...

## సోనియా గాంధీ మరోసారి అస్వస్థత

### ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ...

### కేరళ పర్యటన రద్దు చేసుకున్న రాహుల్ గాంధీ

ఢిల్లీ,: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను మంగళవారం రాత్రి ఆస్పత్రిలో చేర్చారు. సోనియా గాంధీ గురుగ్రామ్‌లోని మెదాంత ఆసుపత్రిలో చేరారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయని ఏఎన్ఐ వార్తా సంస్థ రిపోర్టు చేసింది. సోనియా గాంధీని మంగళవారం రాత్రి 10.22 గంటలకు ఆసుపత్రిలో చేర్చారని, ఆమె పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అయితే కడుపు, మూత్ర నాళాలలో ఇన్ఫెక్షన్లు ఏమైనా ఉన్నాయేమోనని తెలుసుకునేందుకు వైద్యులు తదుపరి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

## చమురు సంక్షోభంతో..

# పొదుపు మంత్రం

### కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని

### అదేబాటలో హోంమంత్రి అమిత్ షా

### పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట



న్యూఢిల్లీ, మే13 : పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది.



2వ పేజీలో...

### పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యం

### పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల

# అనివార్యం

### ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

## కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,మే13 : పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల..



2వ పేజీలో...

### విశ్వాస పరీక్షలో నెగ్గిన

# విజయ్

తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు

విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె

అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు

ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్



2వ పేజీలో...

### సిబిఎస్ఇ 12వ తరగతి

# ఫలితాలు విడుదల

### బాలికలదే పైచేయి

న్యూఢిల్లీ : సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. పరీక్షా ఫలితాల్లో బాలురతో పోలిస్తే బాలికలు పైచేయి సాధించారు. బాలురతో పోలిస్తే బాలికలు ఫలితాల్లో 6.73శాతంతో తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు.




2వ పేజీలో...

### బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్

### నగరంలో పలుచోట్ల

# పోస్టర్ల కలకలం

హైదరాబాద్,మే13 : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బండి భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ఆఫ్‌లో ఉందని.. అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పేట్‌బషీ రాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. తనపై లైంగిక దాడి చేశాడంటూ భగీరథ్‌పై బాలిక ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గాస్పందిస్తూ.. తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు.



2వ పేజీలో...

### ములాయం చిన్నకొడుకు ప్రతీక్

# హఠాన్మరణం

ఆస్పత్రికి తీసుకెళ్లే లోగానే మరణించినట్లు వెల్లడి

ప్రతీక్ మృతికి అఖిలేశ్, సిఎం యోగి సంతాపం



## ఎన్ టి ఎపై సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ : నీట్ -యుజి పేపర్ లీక్ కావడంతో ఆ పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్ టి ఎ)పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎన్ టి ఎ స్థానంలో కొత్త సంస్థను నియమించాలి లేదా పూర్తిగా పునర్నిర్మించాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. ప్రశ్నాప్రతం లీకేజీ, అక్రమాల నేపథ్యంలో వైద్య విద్యకు సంబంధించి మే 3న నిర్వహించిన జాతీయ అర్హతా పరీక్ష (నీట్ -యుజి 2026)ను రద్దు చేస్తున్నట్లు ఎన్టిఎ ప్రకటించిన సంగతి తెలిసిందే.



### హస్తం పార్టీలో మోదీ

# విచ్చు

2వ పేజీలో...

హైదరాబాద్, మే 13,: మూడోసారి దేశ ప్రధానిగా అధికారం చేపట్టిన తరువాత తొలిసారి హైదరాద్ పర్యటనకలో మోదీ వ్యవహరించిన తీరు తెలంగాణ పొలిటికల్ సర్కిల్ లో పెను దుమారం రేపుతోంది. హైదరాబాద్ లో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వచ్చిన మోదీ, అదే సభలో మోదీ ప్రక్కనే కూర్చున్న రేవంత్ రెడ్డితో జోకులు, నవ్వులూ చర్చనీయాంశంగా మారాయి. ఒకరినొకరు నవ్వుతూ పలుకరించుకున్న విధానం, పొలిటికల్ షెటర్లతో రేవంత్ ను మోదీ నవ్వించిన తీరు చూస్తున్నవారంతా ఆశ్చర్యపోయారు.రేవంత్ తో ప్రధాని మోదీ ఇంత సన్నిహితంగా మాట్లాడుతున్నారేంటి, ఓ ప్రధాన ప్రతిపక్ష పార్టీ సీఎంతో ఈ పంచ్ లు, నవ్వులేంటంటూ కమలం నేతలు సైతం షాకయ్యారట. మోదీ ఏం చేసినా ఓ లెక్కుంటుంది. అంత తమాషాగా ఏదోకటి మాట్లాడే వ్యక్తి కాదు నరేంద్రమోదీ. ఆచితూచి రాజకీయ విమర్శలు, వ్యూహాత్మక సంభాషణలతో ప్రత్యర్థులను కట్టిపడేయడంలో పొలిటికల్ మాస్టర్ నరేంద్ర మోదీ. అంతలా గంభీరంగా ఉండే మోదీ తాజా హైదరాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితో సరదాగా మాట్లడుతూ సీఎంను దగ్గర చేసుకునే ప్రయత్నం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. గుజరాత్‌కు ఇచ్చిన నిధులు తెలంగాణకు సైతం ఇవ్వాలంటూ వేదికపై మోదీని రేవంత్ రెడ్డి కోరితే, గుజరాత్ కు మించిన అభివృద్ధి కావాలంటే మాతో చేతులు కలపాలంటూ రేవంత్ ను ఆహ్వానించడం, మోదీ ఆఫర్ కు చేతులు జోడించి సీఎం రేవంత్ నవ్వుతున్న విధానం తెలంగాణ పొలిటికల్..



### ధాన్యం రైతు దిగాలు..

### కొనుగోళ్లలో అన్నీ

# సమస్యలే!

2వ పేజీలో...

వరంగల్ : ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తగ్గడం లేదు. గన్నీ బ్యాగులు, వాహనాల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. వాహనాల టెండర్ కొద్ది మంది కాంట్రాక్టర్లకే రెగ్యులర్ గా ఇస్తుండడంతో పీక్ సీజన్ లో కావాల్సినన్ని వాహనాలు సమకూర్చకపోవడంతో ధాన్యం తరలింపు ఆలస్యమవుతుంది. ధాన్యం కొనుగోలు మొదలు పెట్టినా మిల్లర్లు మాత్రం ఈ సీజన్ లో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తాలు, మట్టి పేరిట తరుగు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ధాన్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. నెల రోజుల నుంచి వరి కోతలు మొదలు కావడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అమ్మకాలు చేస్తున్నారు.

# ధాన్యం రైతు దిగాలు.. కొనుగోళ్లలో అన్నీ సమస్యలే!



కొనుగోలు కోసం ఉమ్మడి జిల్లా పరిధిలో వందలాది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాలు, ఐకేపీ, ఇతర సొసైటీల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మద్దతు ధరకు ఏ గ్రేడ్ రూ.2389, కామన్ గ్రేడ్ రూ.2369 కొనుగోలు చేస్తున్నారు. వరి ఎక్కువ సాగు చేసిన మండలాల పరిధిలో కేంద్రాలను ఎక్కువగా ఏర్పాటు చేశారు.

వేధిస్తున్న సమస్యలు..: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తప్పడం లేదు. గన్నీ బ్యాగుల కొరత ఎక్కువగా ఉంది. పౌరసరఫరాల శాఖ ద్వారా భారీగానే గన్నీ బ్యాగులు సరఫరా చేస్తున్నా కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడిచిన 15 రోజులుగా ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోళ్లు పెంచారు. ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా హన్మకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో వరి సాగు ఎక్కువగా ఉంది. జనగామ, మహబూబాబాద్ జిల్లాలోనూ ఈ యాసంగిలో భారీగానే సాగు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం తరలింపు కోసం ముందే వాహనాలకు టెండర్లు పిలిచారు. కొనుగోలు మొదలు పెట్టగానే తరలింపునకు చర్యలు చేపట్టారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు అవసరమైన వాహనాలు సమకూర్చకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం

మొదటిపేజీ తరువాయి...

కొన్న తర్వాత నాలుగైదు రోజుల వరకు వేచి ఉంటే తప్ప వాహనాలు దొరకడం లేదు. వచ్చిన వాహనాల ద్వారా మిల్లులకు పంపించిన అక్కడ కూడా లైన్ ఉండటం, హమాలీల కొరతతో మరింత ఆలస్యమవుతుంది. టెండర్లు వేసే సమయంలోనే వాహనాలు పెద్ద మొత్తంలో సమకూర్చాలని అధికారులు ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లకు సూచనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడం అధికారులు సహకరించడంతో రైతులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సీజన్ లో ఇదే జరిగిన కాంట్రాక్టర్లను మాత్రం మార్చడం లేదు. ధాన్యం తరలింపుకు ఒక్కో కాంట్రాక్టర్ కు సీజన్ లో కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారు. కిలో మీటర్ లెక్కన భారీగానే చెల్లింపులు చేస్తున్నారు. దూరం ఎక్కువగా ఉంటే అదనంగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఇన్ని చేసినా రైతులకు మాత్రం సమస్యలు తప్పడం లేదు.

మిల్లర్ల చేతివాటం..: ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోలు మొదలైనా మిల్లర్ల చేతివాటం మాత్రం తగ్గలేదు. ఇప్పటికీ తాలు, మట్టి, ఇతర సమస్యలు చెప్పి తరుగు ఎక్కువగా తీస్తున్నారు. ఎండా కాలంలో తేమ తక్కువగా ఉన్నా కారణాలు చెబుతూ కోత విధిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నమోదైన ట్రక్ షీట్ వివరాలకు మిల్లులకు వచ్చిన తర్వాత భారీ తేడా వస్తుంది. క్వింటాలుకు రెండు నుంచి మూడు కిలోలు తగ్గించడంతో నష్టపోతున్నారు. ప్రతీ సీజన్ లో వేల రూపాయలు రైతులు నష్టపోతున్నారు. ఎవరైనా రైతులు వారికి అభ్యంతరం చెబితే రోజుల తరబడి మిల్లుల్లోనే ఉంచుతున్నారు. ప్రభుత్వం రైతులకు తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని చెప్పినా ఎక్కడ కూడా చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొనుగోలు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

# ములాయం చిన్నకొడుకు ప్రతీక్ హఠాన్మరణం

మొదటిపేజీ తరువాయి...

లక్నో, మే13 : సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ములాయం సింగ్ యాదవ్ చిన్న కుమారుడు ప్రతీక్ యాదవ్ (38) హఠాన్మరణం చెందారు. బుధవారం ఉదయం 6:15 గంటల సమయంలో ప్రతీక్ యాదవ్ తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను లక్నో ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రతీక్ యాదవ్ మరణానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాథమిక పరిశీలనలో ఆయన శరీరంపై ఎటువంటి గాయాల గుర్తులు కనిపించలేదని వైద్యులు పేర్కొన్నారు. మరణానికి గల కారణాన్ని నిర్ధారించడానికి కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ వైద్యుల బృందం మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించనుంది. ప్రతీక్ యాదవ్.. మూలాయం సింగ్ యాదవ్ రెండో భార్య కుమారుడు, బీజేపీ నాయకురాలు అపర్ణా యాదవ్ భర్త. రాజకీయ కుటుంబంలో జన్మించినప్పటికీ, ప్రతీక్ యాదవ్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ రియల్ ఎస్టేట్, ఫిట్‌నెస్ రంగాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన అకాల మరణం ములాయం సింగ్ యాదవ్ కుటుంబంలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రతీక్ కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. దీనికి చికిత్స కూడా తీసుకుంటున్నారు. ఈరోజు ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాల్లో యాదవ్ కుటుంబం కీలకంగా ఉన్నప్పటికీ.. ఆయన మాత్రం దూరంగా ఉండేవారు. 2011లో ప్రతీక్-అపర్ణ వివాహం జరిగింది. అయితే ఇటీవల వీరిమధ్య విభేదాలు తలెత్తాయి. అపర్ణ వల్ల తమ



కుటుంబసభ్యుల మధ్య అనుబంధాలు దెబ్బతిన్నాయంటూ భార్యపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. వ్యక్తిగత స్వార్థంతో తమ కుటుంబాన్ని ఆమె ధ్వంసం చేశారంటూ జనవరిలో ఆయన చేసిన పోస్టు చర్చనీయాంశమైంది. ఈ బంధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అనుకుంటున్నట్లు, విడాకులు తీసుకుంటానని పేర్కొన్నారు. 2017లో లఖ్‌నవూ కంటోన్మెంట్ స్థానం నుంచి సమాజ్‌వాదీ తరఫున ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అపర్ణ ఓడిపోయారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున ప్రచారం చేసిన ఆమె.. ప్రస్తుతం ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. తాజాగా ప్రతీక్‌ను చేర్పించిన ఆసుపత్రి వద్ద అపర్ణ కనిపించలేదు. ప్రతీక్ యాదవ్ ఈ రోజు మన మధ్య లేరు. చిన్న వయసు నుంచే ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ వహించేవాడు. స్వయంకృషితోనే జీవితంలో ఎదగాలని కోరుకునేవాడు. రెండు నెలల క్రితం కలిసినప్పుడు ఆరోగ్యం, వ్యాపార విస్తరణ గురించి మాట్లాడుకున్నాం అంటూ అఖిలేశ్ యాదవ్ విచారం వ్యక్తంచేశారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, భాజపా, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ప్రతీక్ మృతికి సంతాపం తెలియజేశారు.

# హస్తం పార్టీలో మోడీ చిచ్చు

మొదటిపేజీ తరువాయి...

సర్కిల్ లో హీట్ పుట్టిస్తున్నాయి.తెలంగాణలో ఇప్పుడున్న ప్రధాన పార్టీలలో మాస్ ఇమేజ్ ఉన్న నాయకులలో ముందు వరుసలో ఉన్నది సీఎం రేవంత్ రెడ్డి. రెండుసార్లు బీఆర్ఎస్ తిరుగులేని అధికారాన్ని సైతం తన మాస్ ఇమేజ్ తో దెబ్బకొట్టి, కాంగ్రెస్ లో చేరిన అతి తక్కువ కాలంలోనే సీఎం పదవి చేపట్టిన మాస్ పొలిటీషియన్ రేవంత్ రెడ్డి. కానీ ఇలా ఓ మాస్ ఇమేజ్ ఉన్న లీడర్ బీజేపీ లో లేరనే చెప్పొచ్చు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల ఇలా వీరితో బీజేపి ఇప్పటికే చేసిన ప్రయోగాలు అంతగా ఫలించలేదు. ఇన్నాళ్లు బీజేపీలో కాస్త మాస్ ఇమేజ్ ఉన్న బండి సంజయ్ ఇప్పుడు కొడుకు కేసుతో చిక్కుల్లో పడ్డారు. నేతల మధ్య ఈగోలే తెలంగాణలో కమలం కొంపముంచుతున్నాయనే అపవాదు ఉండనే ఉంది.ప్రత్యర్థి పార్టీలో ఉన్న మాస్ నేతపై మోదీ కన్నేశారనే టాక్ వినిపిస్తోంది. వెస్ట్ బెంగాల్ లో అసాధ్యమనుకున్న బీజేపి గెలుపును సుసాధ్యం చేసి చూపించారు నరేంద్ర మోదీ. బీజేపి నెక్ట్స్ టార్గెట్ తెలంగాణలో అధికారం చేపట్టడం, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనైనా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకపోతే , క్యాడర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. ఇప్పటికే ఇంకా ఎన్నాళ్లు వేరే పెళ్లికి మన డ్యాన్సులంటూ ఒకప్పటి సొంత పార్టీ నేతలే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. రేవంత్ ను ఇప్పటి నుండే దగ్గర చేసుకుంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలతో రేవంత్ కు ప్రాధాన్యత తగ్గితే, అక్కడ లెక్కలు తేడా వస్తే కమలం గూటికి లాగేయొచ్చనే ఆలోచనలో మోదీ ఉన్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. అందుకేనేమో రేవంత్ రెడ్డితో మోదీ ఈ సాన్నిహిత్యం అంటున్నారు పొలిటికల్ విశ్లేషకులు.

ఇప్పుడున్న పరిస్థితిలో రేవంత్ కాంగ్రెస్ పార్టీని వీడరు. సీఎం పదవి వదులుకోరు. కానీ భవిష్యత్ లో కాంగ్రెస్ లో కుమ్ములాటలు ఎక్కువైతే, తన కుర్చీకే ఎర్త్ పెట్టే పరిస్థితులు వస్తే, రేవంత్ కు ఉన్న సెకండ్ ఆప్షన్ బీజేపీ అనే ఆలోచనలో రేవంత్ ఉన్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మాతో కలసి రండి రేవంత్ అంటూ మోదీ అన్నప్పుడు రేవంత్ నవ్వులు, స్పందించిన తీరు రేవంత్ కు సైతం మోదీపై ఉన్న అభిమానం బహిర్గతం చేస్తున్నాయి.తెలంగాణ కాంగ్రెస్ అంటే గ్రూపు రాజకీయాలకు పెట్టని కోట అనే అభిప్రాయలు ఉండనే ఉన్నాయి. సీనియర్లు, జూనియర్లు, సీఎం వర్గం, మరో వర్గం అంటూ వర్గాల కుమ్ములాటలు ఆరని చిచ్చులా నిత్యం రగులుతూనే ఉంటాయి. అయితే తాజాగా రేవంత్ రెడ్డిపై మోదీ చేసిన వ్యాఖ్యలు. మాతో కలిసి రమ్మంటూ, దగ్గరైన తీరు తెంగాణ కాంగ్రెస్ లో గుబులు పుట్టిస్తున్నాయి. మాస్ లీడర్ ఇమేజ్ ఉన్న రేవంత్ ను మోదీ లాగేస్తే మా పరిస్థితేంటనే అభద్రత కాంగ్రెస్ లో నెలకొనేందుకే మోదీ ఇలా మాట్లాడారనే వారు లేకపోలేదు. కావాలనే కాంగ్రెస్ లో గ్రూపు రాజకీయాల పెట్రోల్ లో మోదీ అగ్గి పెట్టారనే వాదనలు వినిపిస్తున్నాయి. అందుకే రేవంత్ కు మోదీ కావాలనే దగ్గరైయ్యారనేవారు లేకపోలేదు.ఇదే అవకాశంగా రేవంత్ రెడ్డికి వ్యతిరేక వర్గం మోదీ, రేవంత్ సాన్నిహిత్యాన్ని కాంగ్రెస్ అధిష్టానం ఎదుట తమకు అనుకూలంగా వాడుకోవడం ద్వారా రేవంత్ ను టార్గెట్ చేస్తారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న సమేతను తాజాగా హైదరాబాద్ పర్యటనలో నిజం చేశారు మోదీ. సీఎం రేవంత్ ను నవ్వుతూ దగ్గర చేసుకోవడం ద్వారా అటు బీజేపీకి ఊపు, ఇటు కాంగ్రెస్ లో గుబులు పుట్టించారు.

# ఎన్ టి ఎపై సుప్రీంకోర్టులో పిటిషన్

మొదటిపేజీ తరువాయి...

ఈ పరీక్షకు సుమారు 22 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. తిరిగి పరీక్ష నిర్వహిస్తామని ఎన్ టి ఎ ప్రకటించింది. పేపర్ లీక్ పై సిబిఐ విచారణకు ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణ కోసం "మరింత పటిష్టమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ " అవసరమని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) స్పష్టం చేసింది. కోర్టు నేరుగా జోక్యం చేసుకుని, పరీక్షను తిరిగి నిర్వహించడాన్ని పర్యవేక్షించేందుకు, ఇకపై ఎటువంటి లీకులు జరగకుండా చూసుకోవడానికి, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీ అధ్యక్షతన, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని నియమించాలని పేర్కొంది. సుప్రీంకోర్టు నియమించిన మధ్యంతర పర్యవేక్షణ కమిటీ, సవరించిన పరీక్షా ప్రక్రియ భద్రతను ధృవీకరించి, నిర్ధారించే వరకు కోర్టు నియమించిన ఉన్నత స్థాయి కమిటీ పర్యవేక్షణలో నీట్ యుజి 2026 పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశించాలని పిటిషన్ కోరింది. సాక్ష్యాధారాలను నమోదు చేయడంలో వైఫల్యం వంటి ప్రమాదాలను నివారించేందుకు, గతంలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకుల నేపథ్యంలో సూచించిన విధంగా ప్రశ్నాపత్రాలను డిజిటల్ లాక్ చేయడాన్ని, కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి)విధానానికి మారడాన్ని తప్పనిసరి చేయాలని పిటిషన్ లో కోరారు. ఈ పిటిషన్ ను న్యాయవాది తన్వి దూబె దాఖలు చేశారు. నాలుగు రోజుల్లోగా సుప్రీంకోర్టుకు దర్యాప్తు నివేదికను సమర్పించాలని సిబిఐని ఆదేశించాలని ఫైమా కోరింది. సమాచారం లీక్ వెనుక పనిచేస్తున్న నెట్ వర్క్ ల వివరాలు, జరిగిన అరెస్టులు, అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, ప్రాసిక్యూషన్ పురోగతి వివరాలు తప్పనిసరిగా ఉండాలని పిటిషన్ లో పేర్కొన్నారు. అక్రమాలను పారదర్శకంగా గుర్తించేందుకు వీలుగా నీట్-యుజి 2026 కేంద్రాల వారీ ఫలితాలను ఎన్ టి ఎ తక్షణమే ప్రచురించాలని పిటిషన్ లో కోరారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

మొదటిపేజీ తరువాయి...

చెన్నై, మే13 : తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందినపలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్ కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది.పార్టీకి చెందిన 59మంది ఎమ్మెల్యేలువాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యం

మొదటిపేజీ తరువాయి...

పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఓఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## సోనియా గాంధీ మరోసారి అస్వస్థత

మొదటిపేజీ తరువాయి...

సోనియా గాంధీ కుమారుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఆస్పత్రికి చేరుకుని తన తల్లి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అయితే సోనియా గాంధీని ఆస్పత్రిలో చేర్పించడంతో రాహుల్ గాంధీ తన కేరళ పర్యటనను రద్దు చేశారు.అయితే తన పర్యటనను రద్దు చేసుకున్నప్పటికీ కేరళ కోజికోడ్‌లో జరిగిన సభలో రాహుల్ గాంధీ వర్చువల్‌గా ప్రసగించారు. తన తల్లి న్యూఢిల్లీలోని ఆసుపత్రిలో చేరినందుకు తాను ఆ కార్యక్రమానకి వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయానని రాహుల్ గాంధీ తెలిపారు. "నేను ఇక్కడికి రావాలనుకున్నాను, కానీ ఈరోజు ఇంట్లోనే ఉండాల్సి రావడంతో రాలేకపోయాను. నిన్న మా అమ్మను ఆసుపత్రిలో చేర్చారు. కొడుకుగా నాకు ఆమె గురించి చాలా ఆందోళనగా అనిపించింది. అందుకే ఆమెతో ఉండాలని నిర్ణయించుకున్నాను. కేరళ ప్రజలు దీన్ని అర్థం చేసుకుంటారని నాకు తెలుసు. నిన్న రాత్రి మా అమ్మ ఆరోగ్యం గురించి నేను తీవ్రంగా ఆందోళన చెందాను. ఆ రాత్రంతా నాకు ఒకే ఒక్క విషయం ఊరటనిచ్చింది. అదేమిటంటే... కేరళకు చెందిన నర్సు ప్రతి గంటకు ఒకసారి వచ్చి మా అమ్మగారిని కనిపెట్టుకుంటూ, ఆమె ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. అది నాకు ఎంతో ఓదార్పునిచ్చింది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

మొదటిపేజీ తరువాయి...

మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్‌పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్‌పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్‌పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

## బండి భగీరథ్ అప్‌స్కాండింగ్

మొదటిపేజీ తరువాయి...

దీంతో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిట్.. భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈరోజు(బుధవారం) మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. మరోవైపు తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ భగీరథ్.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి...

బాలికలు 88.86శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించగా, బాలురు 82.13శాతం ఉత్తీర్ణ సాధించారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం మూడుశాతం తగ్గింది. తిరువనంతపురం 95.62శాతంతో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేయగా, ప్రయాగ్ రాజ్ 72.43శాతంతో అత్యల్ప శాతాన్ని నమోదు చేసింది. 2026 విద్యా సంవత్సరంలో మొత్తం 17,68,968మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఉత్తీర్ణత శాతం 88.39శాతం నుండి 85.20శాతానికి పడిపోయింది. 1,63,000మందికి పైగా విద్యార్థులు కంపార్ట్ మెంట్ కేటగిరీలో స్థానం పొందారు. గతేడాదితో పోలిస్తే సుమారు 2శాతం పెరుగుదల నమోదైంది. 94,000మందికి పైగా విద్యార్థులు 90శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించగా, 17,000మందికి పైగా విద్యార్థులు 95శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు.

# సంపాదకీయం

## నియోజకవర్గాల పెంపు

## ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 42 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు.. తెలంగాణకు 119 స్థానాలు వెళ్లాయి. అదే సమయంలో లోక్ సభ స్థానాల అంశాన్నే తీసుకుంటే.. ఏపీకి 25 స్థానాలు.. తెలంగాణకు 17 స్థానాలు కేటాయించారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచుతామని చెప్పారు. ఈ లెక్కన ఏపీ అసెంబ్లీలో ఉన్న 175 స్థానాలకు 225 స్థానాలు పెరగాలి. తెలంగాణలో.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు 150కు పెరుగుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్ సభ స్థానాలు 33 మాత్రమే.తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కడ పెరుగుతాయి..? తగ్గే సీట్లు ఎక్కడ తగ్గుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గొచ్చనేది అంచనా. అలా జరిగితే.. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ జనాభా 3.60 కోట్లు కాగా.. జీహెచ్ఎంసీ జనాభానే కోటి పైగా ఉంది. కాబట్టి ఇక్కడ సీట్లు పెంచక తప్పదు. గతంలో పునర్విభజన జరిగినప్పుడు కూడా హైదరాబాద్‌లో సీట్లు పెరిగిన సంగతిని సీనియర్లు గుర్తుచేసుకుంటున్నారు..ఏతావాతా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నగర ప్రాంతాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గుతాయనేది ప్రముఖంగా వినిపిస్తున్న మాట. అలా జరిగితే అర్బన్ ప్రాంతాల్లో పట్టున్న పార్టీలకు, నేతలకు అడ్వాంటేజ్ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. తద్వారా గ్రామీణ ఓటర్ల కంటే అర్బన్ ఓటర్లను ఆకట్టుకోవటానికి పార్టీలు, నేతలు ఎక్కువ ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం అక్కర్లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పార్టీలన్నీ తమ బలాబలాలు, ట్రాక్ రికార్డ్, ఓట్ల శాతం, పట్టున్న ప్రాంతాల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయ వ్యూహం ఖరారు చేసుకునే పనిలో పడొచ్చని నేతలు భావిస్తున్నారు. పార్టీలకు మాత్రం స్వతహాగా మహిళల్లో అనుకూలత లేదు. కొన్నింటికైతే తమ తప్పు లేకుండానే ప్రత్యర్థుల చాతుర్యం కారణంగా మహిళా వ్యతిరేకులనే ముద్ర పడిపోయింది. ఇప్పటికిప్పుడు ఆ ముద్ర చెరిపేసుకోవడం కుదురుతుందా అనేది కొత్త టెన్షన్. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్లు అమలు కాకుండానే.. ఎన్నికల్లో గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో నారీశక్తి ఘనంగా పనిచేసింది. 2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునర్విభజించాలన్న నిబంధన పెట్టారు. ఈ లెక్కన ముందు అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 27,41,239 మంది జనాభా ఉన్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం మేరకు ప్రతి 2లక్షల జనాభాకు ఒక సీటు పెరిగే అవకాశం ఉంది. ఇక లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 లేదా 27 అయ్యే అవకాశాలున్నాయి. జనాభా లెక్కల ఆధారంగా ఏర్పాటు చేస్తే అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ ఎంపీ సీట్లు పెరుగుతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ స్థానాలు, పునర్విభజన అనంతరం 14 లేదా 15 అయ్యే అకాశాలున్నాయి. వీటిలో 33 శాతం కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 5 స్థానాలు మహిళలకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలను కలుపుకొనే మహిళల రిజర్వేషన్ కల్పిస్తారు. అంటే రిజర్వేషన్ పురుషులు, మహిళలు అని మారుతూ ఉంటుంది. దీంతో రాజకీయంగా కొత్త వారికి అవకాశాలు వస్తాయి. పురుషులతోపాటు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొనే వీలు ఉంటుంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వచ్చే ఎన్నికల నాటికి అధికారాన్ని అందుకోవాలని తెగతాపత్రయపడుతోంది. ఇలాంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజనను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కానీ రాష్ట్రంలో తమకు ఉన్న సంస్థాగత బలం.. ఉపయోగపడుతుందనేది బీఆర్ఎస్ లెక్కగా ఉంది. తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీ 2024 ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు చొప్పున గెలుచుకున్నాయి. 1971 జనాభా లెక్కల ప్రకారం 1972లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తర్వాత? నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ? కొన్ని పరిధులు, పేర్ల మార్పుతో 2009లో ఎన్నికలు జరిగాయి. జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజక వర్గాల పునర్విభజన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. కానీ ఇప్పుడు కేంద్రం మాత్రం 2011లో చేసిన జనగణన ఆధారంగా డీలిమిటేషన్‌కు రెడీ అయింది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని ..ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఈ సూత్రాన్ని ఏ మేరకు ఫాలో అవుతారనేది చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి 50 శాతం సీట్ల పెంపు అని చెబుతున్నా.. సమాన ఓటు విలువ విషయంలో తేడాలొస్తాయేమోననే సందేహాలు లేకపోలేదు. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. ఏతావాతా ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా.. ప్రజా ప్రాతినిధ్యానికి ఇబ్బంది లేకుండా డీలిమిటేషన్ చేయాలనేదే రాజ్యాంగం సూత్రీకరణ. దేశంలో గతంలో జరిగిన పునర్వి?భజన ప్రక్రియలు కూడా ఇదే విషయం చెబుతున్నాయి. మరి ఇప్పుడు జరిగే డీలిమిటేషన్ ఎలా జరుగుతుందోనని ఏపీతో పాటు అన్ని రాష్ట్రాలూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

బారామతిలో కూలిన శిక్షణ విమానం..

## పైలట్‌కు గాయాలు



పుణే : మహారాష్ట్ర లో శిక్షణ విమానం కూలిపోయింది. పుణే జిల్లా లోని బారామతి లో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. పుణే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్‌బర్డ్ ఏవియేషన్ సంస్థకు చెందిన విమానం శిక్షణ కార్యక్రమంలో ఉండగా అందులో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో బారామతి విమానాశ్రయాన్ని ఆనుకొని ఉన్న గోజుబావి గ్రామం సమీపంలో విమానం క్రాష్ ల్యాండ్ అయ్యింది. ఇవాళ ఉదయం 8.50 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ల్యాండింగ్‌కి ముందు విమానంలోని కొంత భాగం ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో శిక్షణ పొందుతున్న పైలట్ మాత్రమే ఉన్నారు. ప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. క్రాష్ ల్యాండింగ్ అయిన వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి దారితీసిన సాంకేతిక లోపంపై కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. దీనిపై దర్యాప్తు ప్రారంభించారు. కాగా బారామతి సమీపంలో ఇంతకుముందు కూడా విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఆ ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయారు. ఆయనతోపాటు మరో నలుగురు కూడా మృతిచెందారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం



వర్ధన్నపేట: వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో నాకు న్యాయం జరగడం లేదని సపవాట్ మౌనిక అనే మహిళ కుటుంబంతో సహ వరంగల్ ఖమ్మం హైవే రోడ్డు పై హల్‌చల్ చేశారు. గుబ్బేటి తండాకు చెందిన సపవాట్ సురేష్ అనే వ్యక్తి వివాహేతర సంబంధం పెట్టుకొని తండ్రిని హత్య చేసి మొదటి భార్య మౌనికకు అన్యాయం చేశాడని మౌనిక పోలీస్ స్టేషన్‌ను గతంలో ఆశ్రయించగా తనకు న్యాయం చేయలేదని, తనను ఒంటరి చేసి ముగ్గురు పిల్లలను తీసుకొని పోయి వేరుగా ఉంటున్నారని ఆమె ఆరోపించారు. సురేష్‌కు జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అండతో పోలీసులు మాకు అన్యాయం చేస్తున్నారని పిల్లలని నాకు అప్పజెప్పి న్యాయం చేయమని అడుగగా లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని కుటుంబంతో సహా ఆత్మహత్య ప్రయత్నం చేశారు. హత్య చేసి బెయిల్ పై వచ్చిన సురేష్‌ను పోలీసులు కాపాడుతున్నారని న్యాయం చేయమని వస్తే పోలీస్ స్టేషన్‌లో మౌనికను సురేష్‌తో కొట్టించారని మౌనిక కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం అయిన జరగాలి లేదా చావనైనా చస్తాం అని హైవే పై బైఠాయించడంతో పోలీసులు ఆందోళన విరమించే ప్రయత్నం చేస్తున్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ అంకిత్



ఇల్లెందు, మే 13 : ఇల్లెందు వ్యవసాయ శాఖలో ఉన్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, ఇల్లెందు మండలంలో రేపల్లెవాడ కొనుగోలు కేంద్రాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సరుకు ఉత్పత్తి, నిల్వ, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రైతులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నిబ్యాగ్స్, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ సమస్యలపై రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. త్వరితగతిన కొనుగోలు కేంద్రాలకు సమీపంలో ఉన్న ఫంక్షన్ హాల్స్, ప్రభుత్వ సంబంధిత నిలయాలు, గిరిజన భవన్ వంటివి చూసి సరుకును తరలించాలని ఆదేశించారు. మార్కెట్ యార్డ్ గిడ్డంగులలో మొక్కల నిలువను, అకాల వర్షాలతో తడిచిన మొక్కలను పరిశీలించారు. అనంతరం అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రాంబాబు, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, రెపల్లెవాడ సర్పంచ్ బానోత్ శారద, స్థానిక ఎంపీడీఓ దన్‌సింగ్, తాసీల్దార్ సూర్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ లాల్‌ఛంద్, ఏఓ సతీష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు...

**- చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్ష**
**- జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి**

జగిత్యాల , రాయికల్ : రాయికల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిజామాబాద్ ఎంపీ చేపట్టనున్న ధర్మదీక్షకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు. చదువుల తల్లి స్థలం కోసం, నవోదయ పాఠశాల మరియు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ముందుకు వచ్చి పాఠశాలలను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కుట్రలతో విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియాల్సిందిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ అరవింద్ ధర్మపురి గారిని అడిగిన వెంటనే వారు పిల్లల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియడం జరిగింది. కానీ స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటికే నవోదయ పాఠశాల ప్రారంభమై అడ్మిషన్లు కూడా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. జగిత్యాలలో కూడా సమయానికి స్థలం కేటాయించి ఉంటే ఇప్పటికి పాఠశాల ప్రారంభమై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల నిర్లక్ష్యం వల్ల రెండు సంవత్సరాలుగా విద్యార్థులు



నష్టపోతున్నారని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. విద్యాభివృద్ధిలో కూడా రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ లోపు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని గడువు ఇచ్చామని, ఆలోపు చర్యలు తీసుకోకపోతే జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్మదీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయనున్నారని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలు, రాయికల్ పట్టణం మరియు మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ భోగ శ్రావణి కోరారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి,రాయికల్ మండల్ అధ్యక్షులు ఆకుల మహేష్, రాయికల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ ధర్మపురి, 11వ వార్డ్ కౌన్సిలర్ పురె శ్రీధర్,రాజా చైర్మన్ ముత్యం రెడ్డి,కునారపు భూమేష్, రవీందర్ రెడ్డి, వేముల రాము,తోపారపు సురేష్,పటేల్ రాము,సమల్ల సతీష్,సింగని సతీష్,విజయ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపి

**6నుంచి 15 శాతానికి పెంచిన కేంద్రం**



న్యూఢిల్లీ,మే13 : బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది. బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్లలో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండి దిగుమతుల కట్టడి కోసం ఇటీవల ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్టీ విధించింది. దీంతో, బ్యాంకులు దిగుమతులకు దాదాపు నెల రోజుల పాటు బ్రేక్ చెప్పాయి. ఫలితంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల నాటి కనిష్ఠాన్ని తాకాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## అద్దెకున్న రేకుల స్థలం కబ్జా..

## ఏకంగా బిల్డింగే కట్టేశాడు



కొండాపూర్, మే 13 : తెలిసిన వాళ్లే కదా.. దయ తలచి రేకుల గదులను అద్దెకిస్తే, అదును చూసి ఇంటిని కబ్జా చేశారు. దర్జాగా రేకుల గదులను కూల్చివేసి ఇంటి నిర్మాణాన్ని సైతం చేపట్టారు. ఇదేంటని ప్రశ్నించిన యజమానిని కబ్జాదారులు చితకబాదారు. ఇదంతా ఎక్కడో మారుమూల పల్లెలో లేదా ఏజెన్సీ ప్రాంతంలో జరిగింది అనుకుంటే పొరపాటే. హైటెక్ సిటీకి కూత వేటు దూరంలో, హైటెక్ నియోజకవర్గంగా పేరుగాంచిన శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ డివిజన్ ప్రేమ్ నగర్ లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రేమ్ నగర్‌లో కొన్నేండ్లుగా నివాసముంటున్న బాబు రావు ప్రేమ్ నగర్‌కు చెందిన కన్నా రావు నుంచి 1400ల గజాల స్థలాన్ని 1998లో రూ.3,50,000 పెట్టి కొనుగోలు చేశాడు. కాగా అందులో నుంచి 300ల గజాలలో ఉన్న రేకుల గదులను మహానంది సాగర్ అనే వ్యక్తికి అద్దెకిచ్చాడు. కొంత కాలం బాగానే ఉన్న మహానంది సాగర్, బాబు రావు పరిస్థితులను ఆసరాగా తీసుకుని అద్దె ఇవ్వడం మానేశాడు. సదరు ఇంటిని ఖాళీ చేసేందుకు ససేమిరా అంటూ మొండిగా తయారయ్యాడు. బాబు రావు వైపు నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో సదరు కబ్జాదారుడు ఉంటున్న రేకుల గదులను కూల్చి వేసి, ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. విషయం తెలుసుకున్న బాబు రావు అడ్డుకునేందుకు వెళితే మహానంది సాగర్ కుటుంబ సభ్యులు అతన్ని చితకబాదారు. అటు వైపు వస్తే చంపేస్తామని బెదిరింపులకు దిగారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు, మున్సిపల్ అధికారులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

**నిర్మాణాన్ని కూల్చివేయాలంటూ కోర్టు ఆదేశాలు..:** తనకు జరిగిన అన్యాయంపై బాబు రావు మున్సిపల్ అధికారులతో పాటు కోర్టును ఆశ్రయించాడు. మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి సహాయం అందకపోగా.. సదరు స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని సైతం అడ్డుకోలేకపోయారు. దీని పై కోర్టుకెళ్లిన బాబు రావుకు ఊరట లభించింది. సదరు స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశించినప్పటికీ మున్సిపల్ (టౌన్ ప్లానింగ్) అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ బాధితుడు అవేదన వ్యక్తం చేస్తున్నాడు. న్యాయస్థానం ఆదేశాలను సైతం పట్టించుకోకపోతే మాలాంటి పేదలకు ప్రజా పాలనలో న్యాయం ఎక్కడ దొరుకుతుందంటున్నాడు. రేపు మాపు అంటూ లేనిపోని సాకులు చెబుతూ కాలం వెల్లడిస్తున్నారని, పునాదుల సమయంలో ఫిర్యాదు చేస్తే 4 అంతస్తుల నిర్మాణం అయిన కూడా స్పందన లేదంటున్నాడు. అధికారుల చుట్టూ తిరిగే ఓపిక, శక్తి తనకు లేదని, సదరు కబ్జాదారుల నుంచి ప్రాణహాని ఉందంటూ అవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇకనైనా టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

## 'ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి'

తుంగతుర్తి, మే 13 : ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం ప్రజా ప్రతినిధులు తమ వంతు కృషి చేయాలని పి ఎస్ సి ఎస్ సి చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు జరుగుతున్న విద్యా వారోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ సర్పంచుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేకంగా అల్పాహారాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సర్పంచులు విధిగా పాఠశాలలను సందర్శించి అక్కడ మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, రాత పుస్తకాలు, పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్, 24 వస్తువులతో కూడిన కిట్లను అందజేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న జిల్లా సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, పలు మండల విద్యాధికారులు లింగయ్య, రాములు నాయక్, బాలు నాయక్ ,శాంతయ్య, ప్రభాకర్, రవికుమార్, అన్ని గ్రామాల సర్పంచులు, తిరుమలగిరి మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



### ఛత్రపతి సాహు మహారాజ్ స్ఫూర్తి తో

# బీసీలు పాలన వైపు అడుగులు వేయాలి

## బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్

ఛత్రపతి సాహు మహారాజ్ మరాఠాల భోంస్లే రాజవంశానికి చెందిన ఒక యాదవ్ రాజు. ఆయనని ఛత్రపతి రాజర్షి సాహూ, రాజర్షి సాహూ మహారాజ్, కొల్హాపూర్ సాహూ అని కూడా పిలుస్తారు. ఆయన భారత రాచరిక రాష్ట్రమైన కొల్హాపూర్ మొదటి మహారాజు సాహు మహారాజ్ పట్టాభిషేకం 1894 ఏప్రిల్ 2న జరిగింది.ఆ రోజు ఆయన కొల్హాపూర్ సంస్థానానికి రాజుగా అధికారికంగా పట్టాభిషేకంపొందారు. 06-05-1922వరకు దాదాపు 28 సంవత్సరాలు కొల్హాపూర్ సంస్థానాన్ని సామాజిక న్యాయమే లక్ష్యంగా పరిపాలించారు. సామజికఅసమానతలను చూస్తూపెరిగినఛత్రపతిసాహు మహారాజ్ సమానత్వాన్ని నెలకొల్పాలని సంక ల్పించి .సామజిక న్యాయం,సమానత్వం, విద్యా అభివృద్ధికోసం నిరంతరం కృషి చేశారు. వెనక బడిన వర్గాల అభ్యున్నతి కోసం స్త్రీ విద్య కోసం అంటరానితనం, అమానుషం, పీడన, దోపిడీ, వివక్ష నిర్మూలన కోసం ఆయన పాలన లో తీసుకున్న సంస్కరణలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచాయి. 26-07- 1902 లో కొల్హాపూర్ సంస్థానం లో బ్రాహ్మణేతరులైన, బీసీ,ఎస్సి ఇతర వెనక బడిన వర్గాల ప్రజలకు విద్యా, ఉద్యోగాలలో 50శాతం రిజర్వేషన్లను కల్పిస్తు ఉత్తర్వులను జారీచేయడం తోపాటు గ్రామపరిపాలనరంగంలో వంశపార్యా పరంగాకొనసాగుతున్న, పటేల్, పట్వారి, కులకర్ణి వ్యవస్థను రద్దు చేస్తూ సామజిక న్యాయంఅమలు, కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న గొప్ప సంఘ సంస్కర్త ఛత్రపతి సాహు మహారాజ్ , పూలె ను ఆదర్శంగా తీసుకొని స్త్రీలు, బాలికల విద్య కోసం పాఠశాల లను ఏర్పాటు చేసి పూర్తి ఉచితవిద్యనందించడం తోపాటు బాలికలకు హాస్టళ్లను ఏర్పాటుచేశారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేయడం తోపాటు కులాంతర వివాహాలను చట్టబద్దం చేశారు. తన పాలన లో వ్యవసాయమే జీవనాదారంగా బతుకుతున్న రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల పై ఆధారపడి నష్ట పోకుండా సహకార సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు, చేయూతనిచ్చారు. 1919మే నెల మూడు తారీకు న వెట్టి చాకిరీ వ్యవస్థ ను రద్దు చేస్తూ చట్టం చేసి బానిసత్వ నిర్మూలనకు శ్రీకారం చుట్టారు. అస్పృశ్యుల హక్కుల సాధన కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థాపించినమూక్ నాయక్. పత్రికను నడపడానికి సాహు మహారాజ్ రాజు ఆర్థిక సాయం అందించడం తోపాటు అంబేద్కర్ గారు ఇంగ్లాండ్ వెళ్లి ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్న త్యాగశీలి చత్రపతి సాహు మహారాజు గారు 06-05-1922 నాడు భౌతికంగా ఆయన దూరమైనా ఆయన దేశ ప్రజల మనసుల్లో చిరంజీవి గానిలిచిపోయారు, స్వతంత్రానికి పూర్వమే అణగారిన కులాల ప్రజలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి చరిత్ర సృష్టించారు చత్రపతి సాహు మహారాజ్ హక్కులకు దూరమైన ప్రజల నుండి వచ్చిన నాయకులు మాత్రమే వారి హక్కుల కోసం పనిచేస్తాను, దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు దాటినా రాజ్యాంగ పలాలు బీసీలకు సంపూర్ణంగా అందకపోవడం సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధం, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు,రాజకీయరంగంలో కూడా రిజర్వేషన్లు కావాలని గత 70 సంవత్సరాలుగా బీసీలు పోరాడుతున్నా ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజల అరిగోస ను పట్టించుకునే నాధుడే లేడు. చత్రపతి సాహు మహారాజు స్ఫూర్తితో బీసీలు మిలిటెంట్ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి. ఓటరుగా మిగిలిపోకుండా, ఓటు బ్యాంకు రాజకీయాలను చదరగొట్టి, మెజార్టీ ఓటరులు పాలనవైపు అడుగులు వేసినప్పుడే చత్రపతి సాహు మహారాజు ఆశించిన, నిజమైన సమ సమాజ నిర్మాణం పూర్తవుతుంది.

### జొన్న పంటను కొనుగోలు

## చేయాలంటూ రైతుల ధర్నా



ఆదిలాబాద్ : జొన్న పంటను కొనుగోలు చేయాలంటూ ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. పంట కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జొన్నలను కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నామంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రారంభించి రైతుల పండించిన మొత్తం పంటను కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు మార్కెట్ యార్డ్‌కు రైతులు జొన్నలు భారీగా తీసుకురావడంతో మార్కెట్ ముందు వాహనాల రద్దీ నెలకొంది. నాలుగు రోజులుగా పంట కొనుగోలు నిలిచిపోవడంతో గురువారం నుంచి జొన్నల సేకరణ ప్రారంభిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు ఒకరోజు ముందుగానే పంటను మార్కెట్ కు తీసుకువచ్చారు. అధికారులు సరైన వసతులు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌కు పోటెత్తిన మక్కలు..

### అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందిపడుతున్న రైతులు



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌కు రైతులు జొన్నలు భారీగా తీసుకురావడంతో మార్కెట్ ముందు వాహనాల రద్దీ నెలకొంది. నాలుగు రోజులుగా పంట కొనుగోలు నిలిచిపోవడంతో గురువారం నుంచి జొన్నల సేకరణ ప్రారంభిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు ఒకరోజు ముందుగానే పంటను మార్కెట్ కు తీసుకువచ్చారు. మార్కెటింగ్ సిబ్బంది వాహనాలను లోనికి అనుమతించకపోవడంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం జొన్న పంట కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దీంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చూడాలని రైతులు పండించిన మొత్తం పంటను సేకరించాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

# విదేశీ మారక నిల్వలు పెంచడం ఎలా ?

### దిగుమతులు దెబ్బతీస్తుంటే తెలియదా?
### ఎగుమతులను విస్మరించడంతోనే సమస్య

న్యూఢిల్లీ, : మనవిదేశా మారక నిల్వలు పెరగాలంటే ఎగుమతులు పెరగాలి. దిగుమతలు తగ్గాలి. ఈ సూత్రాన్ని పాటించాల్సిన పాలకులు దీనిని పట్టించుకోవడం లేదు. పంటల దిగుబడి పెరుగుతున్నా వాటిని ఆదయ వనరుగా మార్చుకోవడంలో కేంద్రం విఫలం అవుతోంది. విదేశీమారక నిల్వలు తగ్గిపోతుంటే విదేశీ పెట్టుబడిదారులు ఆ దేశంలో తాము పెట్టిన పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటారు. సాధారణంగా 7-10 నెలలపాటు ముడిచమురు దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉంటే ఆ దేశ పరపతి బాగున్నట్టుగా అంచనా వేస్తారు. 1991లో మన దేశం వద్ద కేవలం 2 వారాలకు సరిపడా మాత్రమే విదేశీ మారక ద్రవ్య నిల్వలున్నాయి. అందుకే మన బంగారాన్ని లండన్‌కి పంపి తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాటి చంద్రశేఖర్ ప్రభుత్వం బంగారం తాకట్టు పెట్టింది. పివి నరసింహారావు ప్రధాని అయ్యాక ఆర్థిక సంస్కరణలు చేపట్టడంతో దేశం దారికి వచ్చింది. తాకట్టు పెట్టిన బంగారాన్ని వడిపంచుకోగలిగాం. దీంతో మళ్లీ మనదేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందంటే ఆ మహానుభావుడి చొరవే కారణం. ఇప్పుడు మోడీ కూడా అలాంటి చొరవ లేదా సంస్కరణలకు దిగాలి. మూడీస్, ఎస్ అండ్ పి, ఫిచ్ వంటి అంతర్జాతీయ సంస్థలు.. ఫారెక్స్ రిజర్వ్ ఎక్కువగా ఉన్న దేశాలకు మంచి రేటింగ్ ఇస్తాయి. ఆ రేటింగ్ ఎంత ఎక్కువ ఉంటే అంత తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తాయి. ఒక దేశం విదేశాల నుంచి అప్పు తీసుకోవాలనుకుంటే.. ఆయా దేశాలు సదరు దేశం వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఎంత ఉన్నాయనే విషయాన్నే చూస్తాయి. ఇప్పుడు మన వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాదాపు 9 నుంచి 11 నెలలకు సరిపడా ఉన్నప్పటికీ.. పరిస్థితులు మన చేతుల్లో లేవు. పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసేలాగా కనిపించట్లేదు. ముడిచమురు ధరల భారంతోపాటు.. ఎరువుల ధరలు కూడా భారీగా పెరిగిపోయే ప్రమాదం కనపడుతోంది. అంటే వాటి దిగుమతుల కోసం చేయాల్సిన ఖర్చు మరింతగా పెరిగిపోయి డాలర్ల రిజర్వు అనుకున్నదానికంటే వేగంగా కరిగిపోయే ముప్పుంది. దీనికితోడు.. మనకు వచ్చే విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవే. అక్కడున్న భారతీయులు మనదేశంలో ఉన్న తమ కుటుంబసభ్యులకు పంపే డబ్బు కారణంగా విదేశీ మారకం భారీగా పెరిగింది.. యుద్ధం దెబ్బకు అతలాకుతలమైన గల్ఫ్ దేశాల్లో ఉంటున్న మనవాళ్లు పంపే డబ్బు తగ్గిపోతోంది. దీనికితోడు.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన ఎగుమతులకు, తద్వారా మనకు రావాల్సిన డాలర్లకు కూడా ఆటంకం కలుగుతోంది. ఒకవైపు మనకు రావాల్సిన విదేశీ మారక ద్రవ్యంలో కోత పడుతుండగా, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు కరిగిపోతున్నాయి. 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం, దేశ జాతీయ రుణం అక్షరాలా రూ.235.4 లక్షల కోట్లు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి మన అప్పు కేవలం రూ.54.9 లక్షల కోట్లు మాత్రమే. అంటే, కేవలం పదేండ్ల కాలంలో దేశం చేసిన అప్పు 4.3 రెట్లు పెరిగింది. ప్రతి భారతీయుడిపై సగటున రూ.1.66 లక్షల అప్పు ఉన్నది. జీడీపీలో అప్పు నిష్పత్తి 67 శాతం నుంచి 83.9శాతానికి చేరుకున్నది. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని పాలకులు గర్వంగా చెప్తుంటారు. 3.73 ట్రిలియన్ల డాలర్ల జీడీపీతో మనం ఆ స్థానంలో ఉన్నమాట నిజమే. కానీ, ఇందులో ఒక పెద్ద మాయ ఉన్నది. ఒక దేశం ఎంత ధనవంతమైనదో చెప్పాల్సింది దాని మొత్తం ఆదాయం కాదు, ఆ దేశ పౌరుడి తలసరి ఆదాయం. దేశ ఆర్థిక శక్తిని తలసరి ఆదాయపరంగా విశ్లేషిస్తే విస్తుపోయే వాస్తవాలు కనిపిస్తాయి. ఆదాయ పంపిణీలో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నామని, సంపద కేవలం పైస్థాయిలోనే కేంద్రీకృతమై సామాన్యుడి వరకు ఆశించిన స్థాయిలో చేరటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క అమెరికన్ సంపాదన మన దేశంలోని 30 మంది పౌరుల మొత్తం ఆదాయంతో సమానం. జనాభాపరంగా మనం పెద్ద దేశం కాబట్టి జీడీపీ పెద్దదిగా కనిపిస్తుంది. కానీ పౌరుడి జీవన ప్రమాణాల విషయానికి వస్తే ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం మనం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నాం. 2014 ఎన్నికల సమయంలో రూపాయి విలువ పడిపోతుంటే అప్పటి పాలక వర్గాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. అప్పుడు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.60. ఇప్పుడు అది రూ.94 దాటిపోయింది. పదేండ్లలో రూపాయి విలువ 40శాతం పైగా కుప్పకూలింది. రూపాయి బలహీనపడటం అంటే మనం విదేశాల నుంచి కొనే పెట్రోల్, డీజిల్, వంట నూనె ధరలు పెరగటం. ఈ భారం నేరుగా సామాన్యుడి వంటగదిపై పడుతున్నది. దేశానికి వెన్నెముక వంటి యువత ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నది. ప్రతి ఏటా కోటిన్నర మంది ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తుంటే, ప్రభుత్వం సృష్టిస్తున్న అవకాశాలు కేవలం కొన్ని లక్షలు మాత్రమే. ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని చెప్పి చేపట్టిన నోట్ల రద్దు దేశాన్ని కుదిపేసింది. జీఎస్టీ అమలు ఒకే దేశం ఒక పన్ను అనేది వినటానికి బాగున్నా, దాని సంక్లిష్టమైన స్లాబ్‌లు చిన్న వ్యాపారులకు శాపంగా మారాయి. కోట్లాది చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఆదాయ పంపిణీ గొడవలు నిత్యకృత్యమయ్యాయి. అచ్చే దిన్ అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది.

## ఎంపీడీవో సంధ్యకు డిప్యూటీ సీఈవోగా పదోన్నతి



మొయినాబాద్: గత నాలుగున్నరేళ్లుగా మొయినాబాద్‌లో ఎంపీడీవోగా సేవలు అందిస్తూ మండల ప్రజల మన్ననలు చూరగొన్న మృధుస్వభావి సంధ్యకు సిద్దిపేట జిల్లా డిప్యూటీ సీఈవోగా పదోన్నతి వరించింది. కాగా, ప్రస్తుతం ఎంపీవోగాఉన్న వెంకటేశ్వర్ రెడ్డి ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లా డుతూ.. నా జీవితంలో ఈ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతున్న తరుణంలో మీ అందరితో కలిసి పనిచేసే అవకాశం లభించినందుకు నేను ఎంతగానో కృతజ్ఞురాలిని అని చెప్పారు. ఈ 4 సంవత్సరాల 4 నెలల ప్రయాణం అద్భుతంగా సాగిందని, ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఈ ప్రయాణాన్ని నేను ఎప్పటికీ పదిలపరుచుకుంటానని అన్నారు. అలాగే నాకు అండగా నిలిచిన సహోద్యోగులు, అన్నింటికంటే ముఖ్యంగా స్నేహితులుగా ఉన్నందుకు మండల ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# ఒత్తిడిలో పడితే నిర్వీర్యమే






మనిషికి ఒత్తిడి వల్ల ఎదురయ్యే అనర్థాలెన్నో... లెక్కలేనన్ని మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయి చివరకు సంతానోత్పత్తి సామర్థ్యమూ దెబ్బతింటుంది వీర్యకణాల సంఖ్యను, బలాన్ని కుదించేస్తుంది. అందుకే ఒత్తిడి వద్దు... సోదరా!

అధిక ఒత్తిడి వల్ల సంతానోత్పత్తి సమస్యలూ వస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వీర్యకణాల సంఖ్య పడిపోవడానికి, అవి బలహీనంగా కదలడానికి- అధిక ఒత్తిడి స్థాయిలతో సంబంధం ఉందని పరిశోధనలు తేల్చాయి. పురుషులు నిరంతరం ఒత్తిడికి లోనవడం వీర్యకణాల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జామిన్ బ్రహ్మభట్ అంటున్నారు.

ఏం జరుగుతుంది?:ఒత్తిడి వల్ల.. శరీరం చేసే పనుల తీరు తెన్నులే మారిపోతాయి. ఒత్తిడి కలిగినప్పుడు, శరీరం కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లను విడుదల చేస్తుంది. ఒత్తిడి సమయాల్లో మనం స్పందించడానికి సహాయపడే శరీర అంతర్నిర్మిత హెచ్చరిక వ్యవస్థలో ఇదో భాగం. స్వల్పకాలంలో ఇది మంచిదే. కానీ ఒత్తిడి వారాలు, నెలల పాటు కొనసాగినప్పుడు నిద్ర దెబ్బతింటుంది. శక్తి తగ్గిపోతుంది. మానసిక స్థితి మారుతుంది. బరువు పెరుగుతాం. లైంగిక వాంఛ తగ్గిపోతుంది. కొందరు దుర్వ్యసనాలకు అలవాటు పడతారు. దీనివల్ల సంతానోత్పత్తి సమస్యల్ని ఎదుర్కొంటారు. శుక్రకణాలు ఉత్పత్తి అయి, పరిపక్వం చెంది, వీర్యంలో కనిపించడానికి సుమారు రెండు, మూడు నెలల సమయం పడుతుంది. దీర్ఘకాలిక అలసట, నిద్రలేమి.. శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచుతాయి. ఇది శుక్రకణాలను నేరుగా దెబ్బతీస్తుంది. అధిక ఒత్తిడి స్థాయిలు శుక్రకణాల సంఖ్య తగ్గిపోవడం, అవి బలహీనంగా కదలడం, సరైన ఆకారం లేకపోవడం వంటి వాటికి దారితీస్తాయని పరిశోధనలు తేల్చాయి. దాదాపు 1,200 మందికి పైగా పురుషులపై జరిపిన ఓ అధ్యయనంలో- మధ్యస్థాయి ఒత్తిడి ఉన్న వారితో పోలిస్తే అధికస్థాయి ఒత్తిడి ఉన్నవారిలో వీర్యకణాల సాంద్రత, సంఖ్య బాగా తక్కువగా ఉన్నట్లు తేలింది.

ఏం చేయాలి?: ఒత్తిడి ఎందువల్ల కలుగుతుందో తొలుత గుర్తించాలి. తగినంతగా నిద్రపోతున్నారా? శారీరకంగా చురుకుగా ఉంటున్నారా? ఎక్కువగా మద్యం తాగుతున్నారా? మాదకద్రవ్యాలు వాడుతున్నారా? ఇత్యాది అంశాల్ని విశ్లేషిస్తే వారు ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారో గుర్తించొచ్చు. డిజిటల్ వ్యాపకం మనలో విపరీతమైన ఒత్తిడి భావనలు కలగజేస్తుంది. చాలావరకు దానికి బానిస కాకుండా చూసుకోవాలి. నిద్ర టెస్టోస్టిరోన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. వీర్య కణాల వృద్ధికి టెస్టోస్టిరోన్ చాలా అవసరం. అందువల్ల 7 నుంచి 9 గంటలు నిద్రపోవడం మంచిది. క్రమం తప్పని శారీరక శ్రమ హార్మోన్ల నియంత్రణకు, కార్టిసాల్‌ను తగ్గించడానికి, ఆరోగ్యకరమైన బరువును కాపాడుకోవడానికి సహాయపడుతుంది. జిమ్‌లో కఠినంగా వ్యాయామం చేయడం కంటే శరీర నిరంతర కదలికలు ముఖ్యం. అధిక బరువు పురుషుల్లో ఈస్ట్రోజెన్ స్థాయిల్ని పెంచుతుంది, ఇది టెస్టోస్టిరోన్‌ను అణచేసి, వీర్య కణాల ఉత్పత్తిని ప్రేరేపించే హార్మోన్ల సంకేతాలకు అంతరాయం కలిగిస్తుంది. అందువల్ల బరువు తగ్గించుకోవడం మంచిది. కోటిన్, గంజాయి, అధిక ఆల్కహాల్ ఇవన్నీ వీర్యకణాలు తగ్గిపోవడానికి, బలహీనమైన చలనానికి, అసాధారణ కణ ఆకృతులకు కారణమవుతాయి. వీటిని తగ్గించుకోవడం మన చేతుల్లో ఉంటుంది. దీర్ఘకాలిక ఒత్తిడి శరీరాన్ని బలహీనపరుస్తుంటే, దాని ప్రభావం సంతానోత్పత్తి సామర్థ్యంపై పడొచ్చు. అందువల్ల ఒత్తిడి కారణాలను గుర్తించి, అది పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. సంతాన ప్రాప్తిరస్తు!

## బొల్లోరిగూడెంలో హృదయ విదారక ఘటన..
### పసికందును పీక్కుతిన్న కుక్కలు

పాల్వంచ టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని బొల్లోరిగూడెంలో బుధవారం హృదయ విదారక ఘటన వెలుగుచూసింది. బొల్లోరిగూడెంలోని ఓ ప్రాంతంలో కుక్కలు పసికందు తల భాగాన్ని పీక్కుతింటుండగా స్థానికులు గమనించి వెంటనే వాటిని తరిమికొట్టారు. ఈ దృశ్యాలను చూసిన ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనతో ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. పసికందు అవశేషాలు అక్కడికి ఎలా చేరాయి? ఎవరు పడేశారు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుర్వాసన వ్యాపించడంతో సమీప ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందిన వెంటనే అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఖర్చులు తగ్గింపు... మోడీ నుంచే మొదలవ్వాలి !



ఢిల్లీ,: మంచో చెడో...ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్ల జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోదీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700–900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024–25తో పోలిస్తే.. 2025–26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుమతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతున్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకులకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

## రామగుండం ఎమ్మెల్యే



గోదావరిఖని: ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని, అధికారులు అలసత్వం చేస్తే అసలు సహించబోమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని నగరంలోని 51వ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలపై స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తెలుసుకొని ఆయన మాట్లాడారు. వార్డులో స్వయంగా పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. కాలనీలో పేరుకుపోయిన మురుగునీరు, చెత్త సమస్యలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులను ప్రశ్నిస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం అసలు సహించబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య యాదవ్, కార్పొరేటర్లు దూళికట్ట సతీష్, రామోజుల మహేష్, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దువ్వాడకు జగన్ షాక్



శ్రీకాకుళం, : తెలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ సెలబ్రిటీ అంటే.. ముందుగా గుర్తొచ్చే పేరు దువ్వాడ శ్రీనివాస్. వైసీపీ ఎమ్మెల్సీగా ఉండి ఒక మహిళ కోసం జరిగిన కుటుంబ వివాదంతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందని చెప్పి ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే ఇది తాత్కాలికమేనని.. తిరిగి తాను వైసీపీలో యాక్టివ్ అవుతానని దువ్వాడ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఆయన మాటల్లో జగన్మోహన్ రెడ్డి పట్ల ఫ్లేవరు, ఫేవర్ కనిపిస్తూ వచ్చింది. జగన్మోహన్ రెడ్డి సైతం మొన్న ఆ మధ్యన ఏంటి శ్రీనివాస్ అని పలకరించే సరికి పులకించుకుపోయారు దువ్వాడ. ఇక తాను అడిగిందే తరువాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి జగన్ మోహన్ రెడ్డి తిరిగి ఆహ్వానిస్తారు అని భావించారు. కానీ ఇటీవల జగన్ వద్దకు వెళ్లిన దువ్వాడకు షాక్ కొట్టే విషయాన్ని చెప్పారు అధినేత. పార్టీలో చేరిక విషయంలో తానేం చేయలేనంటూ జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. శ్రీకాకుళం జిల్లాలో దూకుడు కలిగిన నేతగా దువ్వాడ శ్రీనివాస్ కు పేరు ఉంది. దశాబ్దాల కిందట నుంచి కాంగ్రెస్లో రాజకీయాలు నడుపుతూ వచ్చారు. కానీ ఎందుకో చట్టసభలకు మాత్రం వెళ్లలేకపోయారు. కానీ ఆ ముచ్చట తీర్చారు జగన్మోహన్ రెడ్డి. ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టడంతో శాసనమండలిలో అడుగు పెట్టారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా మూడుసార్లు ఛాన్స్ ఇచ్చారు. ఒక్కసారి కూడా నెగ్గుకు రాలేకపోయారు దువ్వాడ శ్రీనివాస్. కానీ కింజరాపు ఫ్యామిలీ పై దూకుడుగా అడుగులు వేయాలంటే దువ్వాడ ఉండాల్సిందేనని చెప్పి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ప్రోత్సహించారు. కానీ వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలతో పార్టీకి చేటు తెచ్చారు.

అందుకే సస్పెన్షన్ వేటు పడింది. అయితే ప్రారంభంలో వైసిపి నేతల నుంచి ఏం హామీ వచ్చిందో తెలియదు కానీ.. ఆ పార్టీలో సీనియర్ నేతలైన ధర్మాన బ్రదర్స్ పై ఒంటికాలితో లేచారు దువ్వాడ. దానికి కాస్త కులం రంగు పులిమారు. వైసీపీలోకి వస్తే కాచుకోండి అంటూ తేల్చి చెప్పారు. అంతటితో ఆగకుండా వైసీపీ లేకపోతే ఇండిపెండెంట్ ప్యానల్స్ తో ఓడిస్తాను అంటూ శపథం కూడా చేశారు. అయితే పార్టీలోకి వస్తానని చెప్పి ఇటీవల జగన్మోహన్ రెడ్డిని దువ్వాడ శ్రీనివాస్ కలిశారట. అయితే ధర్మాన సోదరులు పావులు కాదపడంతో జగన్మోహన్ రెడ్డి నో అని చెప్పారట.

యితే మొన్నటికి మొన్న తన వెనుక నిలిచిన వైసిపి పెద్దలు సైతం ఇప్పుడు ముఖం చాటేసారట. అయితే దువ్వాడ శ్రీనివాస్ ఇటీవల రాజకీయ ప్రకటనలు చేయలేదు. మరి జగన్ నో చెప్పిన నేపథ్యంలో దువ్వాడ శ్రీనివాస్ ఎలా స్పందిస్తారో చూడాలి.

# బాలినేనికి కీలక బాధ్యతలు



ఒంగోలు,: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై ఉమ్మడి జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలలో వైసీపీ నుంచి వచ్చిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభానులకు స్థానం కల్పించారు. బాలినేని శ్రీనివాసరెడ్డికి ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటుగా ప్రకాశం, నెల్లూరు జిల్లాలను అప్పగించారు. ఇక సామినేని ఉదయభానుకు, నాదెండ్ల మనోహర్‌కు కలిపి కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక బాధ్యతలు అప్పగించారు. డీ లిమిటేషన్ ప్రక్రియతో పాటుగా ఏపీలో త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కమిటీలను ఏర్పాటు చేసింది. మొత్తం 11 మంది సభ్యులతో మూడు కమిటీలను ఏర్పాటు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సభ్యులకు తాజాగా జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి రాయలసీమ జిల్లాలైన ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటుగా.. ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాధ్యతలు అప్పగించింది. పవన్ కళ్యాణ్ ఆదేశాలత బాలినేని శ్రీనివాసరెడ్డి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు. డీలిమిటేషన్ అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ పర్యటన వివరాలతో సమగ్ర నివేదికను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సమర్పించనున్నారు. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటుగా ఆరణి శ్రీనివాసులు, టీసీ వరుణ్‌కు స్థానం కల్పించారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కోసం కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సీహెచ్ వంశీకృష్ణలతో కమిటీ ఏర్పాటైంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కోసం పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, కొటికలపూడి గోవిందరావులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇక కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభానులకు అప్పగించారు. మరోవైపు జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే వారం కమిటీలను ప్రకటించనున్నట్లు జనసేన పార్టీ తెలిపింది. జనసేన పార్టీ సంస్థాగత విస్తృత నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన ప్రక్రియలో పవన కళ్యాణ్ నిమగ్నమై ఉన్నారన్న జనసేన.. పార్టీ నిర్మాణంలో భాగమైన కమిటీల ఏర్పాటు కోసం గత కొన్ని నెలలుగా పవన్ కళ్యాణ్ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. శస్త్రచికిత్స నుంచి పూర్తిస్థాయిలో ఇంకా కోలుకోకపోయినప్పటికీ.. ఆరోగ్యపరమైన ఇబ్బందులున్నా కూడా కమిటీల ప్రకటనపై దృష్టిపెట్టారని తెలిపింది.

# తెలంగాణలో స్వీపర్ కు 2 లక్షలు..

## ఒక్కో పోస్టుకు 800 మంది దరఖాస్తు

హైదరాబాద్, మే 13, : డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి, సాఫ్ట్‌వేర్ ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి, నెలకు ముప్పై వేల జీతం కోసం నానా తంటాలు పడే కుర్రాళ్లకు ఈ వార్త వింటే గుండె ఆగుతుందేమో. ఈ వార్త విన్న తర్వాత రాష్ట్రంలోని నిరుద్యోగులంతా రెజ్యూమ్ లో స్కిల్స్ వద్ద 'జావా, పైథాన్' తీసేసి 'స్వీపింగ్, క్లీనింగ్' అని మార్చుకునే పనిలో పడుతారు కావచ్చు. ఏ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కలలో కూడా ఊహించని ఈ వేతనాల మాయాజాలం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ ఒక స్వీపర్ జీతం నెలకు ఎంత ఉంటుంది ప్రభుత్వ రంగ సంస్థనా.. ప్రైవేట్ సెక్టారా.. రెడింటికీ తేడా ఉంటుంది.. ప్రభుత్వ రంగమే అయినా ఎంత ఉంటుంది.. మా అంటే రూ. 10వేలు, ఈ కాలంలో పది వేల పనే లేదు.. సరే.. రూ. 20 నుంచి రూ. 30 వేల వరకు ఒకే.. కానీ ఇక్కడ అంత కాదు ఏకంగా రూ. 2 లక్షలు అంటే ఆశ్చర్యపోవాల్సిందే. మన దేశంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల జీతాల కంటే కూడా ఇవి ఎక్కువగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఇటీవల జరిగిన 16వ ఆర్థిక సంఘం రివ్యూ మీటింగ్‌లో ఈ ఆసక్తికరమైన నిజాలను వెల్లడించారుతెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో భారీ మార్పులు వచ్చాయి. ముఖ్యంగా విద్యుత్ రంగ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో వేతనాలు ఇతర శాఖల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి.

ఎవరికి ఎంత జీతం? రివ్యూ మీటింగ్‌లో వెల్లడైన వివరాల ప్రకారం.. సుమారు 20–30 ఏళ్ల సర్వీస్ ఉన్న సీనియర్ క్లాస్-4 ఉద్యోగులు (స్వీపర్లు, అటెండర్లు) నెలకు రూ. 2 లక్షల వరకు జీతం అందుకుంటున్నారు. పవర్ యుటిలిటీస్‌లో పనిచేసే చీఫ్ ఇంజినీర్ స్థాయి అధికారుల వేతనం నెలకు ఏకంగా రూ. 7 లక్షల వరకు ఉంది. జీహెచ్‌ఎంసీ వంటి సంస్థల్లోని రెగ్యులర్ శానిటేషన్ వర్కర్లు కూడా సుమారు రూ. 70,000 నుంచి రూ. లక్ష వరకు సంపాదిస్తున్నారు. ఇంత జీతాలకు కారణం.. ఈ శాఖలో వేతనాలు ఇంత భారీగా ఉండటానికి కొన్ని ప్రత్యేక కారణాలు ఉన్నాయి. సాధారణ ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లకోసారి పీఆర్సీ అమలు జరుగుతుంటే, విద్యుత్ శాఖలో ప్రతి నాలుగేళ్లకోసారి వేతన సవరణ జరుగుతుంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి జరిగిన వరుస వేతన సవరణలు, డీఏ (ఆం) పెరుగుదలలు ఈ జీతాలను ఐఏఎస్ అధికారుల వేతనాల కంటే పైకి తీసుకెళ్లాయి. ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సగటు వయస్సు 50 ఏళ్లు ఉండటం వల్ల, సుదీర్ఘ సర్వీసులో వారికి వచ్చిన ఇంక్రిమెంట్లు జీతాలను ఈ స్థాయికి చేర్చాయి. జీతాల పెరుగుదల వల్ల రాష్ట్ర ఖజానాపై ఒత్తిడి పెరుగుతోందని సీఎస్ రామకృష్ణారావు అభిప్రాయపడ్డారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు నెలకు జీతాలు, పెన్షన్ల కోసం రూ. 1,500 కోట్లు ఖర్చు అయ్యేది, ప్రస్తుతం అది రూ. 6,000 కోట్లకు చేరింది. గత పదేళ్లలో రాష్ట్రం చేసిన మొత్తం రూ. 15 లక్షల కోట్ల వ్యయంలో దాదాపు రూ. 12 లక్షల కోట్లు కేవలం జీతాలు, పెన్షన్లు, అప్పుల చెల్లింపులకే ఖర్చయ్యాయి. ఇంత భారీ వేతనాలు ఉండడం వల్లే ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన క్రేజ్ పెరిగింది. ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిన 563 గ్రూప్-1 పోస్టుల కోసం ఒక్కో పోస్టుకు సగటున 799 మంది అభ్యర్థులు పోటీ పడటం దీనికి నిదర్శనం.

# హైదరాబాద్ బెటర్

## వైరల్ గా మారిన బెంగళూర్ టెకీ కామెంట్స్

హైదరాబాద్, మే 13,: సాఫ్ట్‌వేర్ హబ్‌లుగా పేరుగాంచిన హైదరాబాద్, బెంగళూరు నగరాల మధ్య పోలిక ఈనాటిది కాదు. ఐటీ కంపెనీలు, జీవన ప్రమాణాలు, వాతావరణం.. ఇలా ప్రతి విషయంలోనూ ఈ రెండు నగరాల మధ్య పోటీ ఉంటుంది. అయితే తాజాగా ట్రాఫిక్ విషయంలో ఈ రెండు నగరాల మధ్య జరిగిన ఒక ఆసక్తికర చర్చ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్ రోడ్ల మౌలిక సదుపాయాలను చూసి ఓ బెంగళూరు వ్యక్తి ఆశ్చర్యపోతూ పెట్టిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. ఆర్చీ సేన్‌గుప్తా అనే వ్యక్తి ఎక్స్ వేదికగా తన అనుభవాన్ని పంచుకుంటూ.. "నేను ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నాను. ఇక్కడ 12 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 30 నిమిషాల్లో పూర్తి చేశానంటే నా బెంగళూరు మెదడుకు అర్థం కావడం లేదు. ఎందుకంటే బెంగళూరులో 30 నిమిషాలు అంటే కేవలం ఒక కిలోమీటరు ప్రయాణించినట్లే లెక్క. ఇక్కడి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిజంగా అద్భుతం" అంటూ రాసుకొచ్చారు.

ఈ పోస్ట్ పెట్టిన కొద్దిసేపటికే 43,000కు పైగా వ్యూస్, వందలాది కామెంట్లతో నెట్టింట జోరుగా చర్చ నడిచింది. "నేను ఆఫీసు నుండి బయలుదేరినప్పుడు 50 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 45–55 నిమిషాల్లోనే చేరుకుంటాను" అని ఒక హైదరాబాద్ యూజర్ గర్వంగా చెబితే.. "నేను బెంగళూరు నుండి హైదరాబాద్ మారినప్పుడు నా ప్రయాణ సమయం అకస్మాత్తుగా నార్మల్ అయిపోయింది" అని మరొకరు తన అనుభవాన్ని పంచుకున్నారు. 5 కిలోమీటర్లు అంటే అది చాలా పెద్ద దూరం అని నమ్మేలా బెంగళూరు ట్రాఫిక్ మనల్ని మార్చేసింది అంటూ కొందరు వాపోయారు.

బెంగళూరులో ప్రజా రవాణా, రోడ్ల ప్రణాళికపై తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అయితే అందరూ హైదరాబాద్‌ను పొగడటంతో ఏకీభవించలేదు.

"మీరు ఆదివారం ప్రయాణించి ఉంటారు, వర్షం పడినప్పుడు మా ట్రాఫిక్ చూడండి.. త్వరలోనే మేము కూడా బెంగళూరు స్థాయికి చేరుకుంటాము" అని కొందరు స్థానికులు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని విశాలమైన రోడ్లు, వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కింద నిర్మించిన ఫ్లైఓవర్లు, మల్టీ లెవల్ గ్రేడ్ సెపరేటర్లు, అత్యంత వేగవంతమైన ఔటర్ రింగ్ రోడ్ నగర రవాణా ముఖచిత్రాన్ని మార్చేశాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి బెంగళూరు టెక్కీ చేసిన ఈ పోస్ట్ రెండు నగరాల మౌలిక సదుపాయాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మరోసారి ఎత్తిచూపింది. హైదరాబాద్ ప్రణాళికాబద్ధంగా దూసుకుపోతుంటే, బెంగళూరు తన పాత ట్రాఫిక్ కష్టాల నుండి బయటపడటానికి ఇంకా కష్టపడుతూనే ఉంది.

## గరిడేపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ గౌడ్..



గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి నూతన ఎస్సైగా శ్రీకాంత్ గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూరు ఎస్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసి బదిలీపై వచ్చారు. 2012 బ్యాచ్‌కు చెందిన శ్రీకాంత్ గౌడ్.. మొదటగా నేరేడుచర్ల స్టేషన్ ప్రొబేషనరీ ఎస్సైగా పని చేశారు. అనంతరం పెన్ పహాడ్ ఎస్సైగా, ఆత్మకూరు ఎస్ ఎస్సై విధులు నిర్వహించిన ఆయన గరిడేపల్లి ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రత పరిరక్షణతో పాటు అందరి సహకారంతో పోలీస్ స్టేషన్ వచ్చే సమస్యలను పరిష్కరిస్తానని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

## త్వరితగతిన దిగుమతులు చేసుకోవాలి : తాసీల్దార్ పుష్పలత



కట్టంగూర్,మే13 : లారీల ద్వారా మిల్లులకు వచ్చిన ధాన్యం బస్తాలను త్వరితగతిన దిగుమతులు చేసుకోవాలని తాసీల్దార్ పుష్పలత అన్నారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల మణిసాయి రైస్ మిల్లుతో పాటు పిట్టంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ధాన్యం దిగుమతులను పరిశీలించి సమస్యలను రైతులు, మిల్లర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించి వివరాలను ట్యాబ్ లో నమోదు చేయాలన్నారు. కేంద్రాల నిర్వాహకులు లారీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాంటాలో లేదావస్తే నిర్వాహకులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట నిర్వాహకులు, సిబ్బంది ఉన్నారు.

## అధికారంలో ఉంటే చట్ట వ్యతిరేక పనులు చేయవచ్చా?

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సూటి ప్రశ్న



వనపర్తి : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అఘాయిత్యాలపై బీఆర్ఎస్ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వనపర్తిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న పార్టీ నాయకులు చట్ట వ్యతిరేక పనులు చేయవచ్చా అంటూ నిలదీశారు. బండి భగీరథ్‌పై ఫోక్సో కేసు నమోదైనప్పటికీ అరెస్టు చేయకుండా అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు చట్టానికి,రాజ్యాంగానికి కట్టుబడి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవస్థను బలహీనంగా చేయడం వల్ల సమాజం బలహీన పడుతుందని పేర్కొన్నారు. మైనర్ బాలిక కుటుంబానికి ఒక సెక్షన్ మీడియా వంతపలకడం శోచనీయం అన్నారు. అద్భుతమైన కాళేశ్వరం కట్టిన కేసీఆర్‌పై దుష్ప్రచారం చేయడం, ఇచ్చిన హామీలు అమలు చేయనివారికి అండగా నిలువడం దారుణమని అన్నారు. నైతిక విలువలు కాపాడాల్సిన బాధ్యత అన్ని సంస్థలపై ఉందని నిరంజన్ రెడ్డి అన్నారు.





# పోక్సో చట్టం ఏం చెప్తున్నది?

తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా ఇప్పుడొక కేసు గురించి పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు, నిందితుడి పరారీ, కేసు పూర్వాపరాలపై విస్తృతమైన చర్చ నడుస్తున్నది. ఈ చర్చలో కొందరు తమకు తోచిన విధంగా చట్టానికి భాష్యాలు చెప్తున్నారు. మరికొందరు అసత్యాలు, అర్ధసత్యాలను ప్రచారం చేస్తున్నారు. పోక్సో చట్టంపై అవగాహన లేకనో, ఉద్దేశపూర్వకంగానో చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. ఇవి కూడా నేరాలే. ఈ నేపథ్యంలో అసలు బాలల పరిరక్షణలో పోక్సో చట్టం ప్రాధాన్యత ఏంటి, చట్టం ఏం చెప్తున్నది తెలుసుకుందాం.

ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రెన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం ఉద్దేశం లైంగిక దాడుల నుంచి బాల బాలికలకు రక్షణ కల్పించడం. దేశంలో మహిళలపై, ముఖ్యంగా చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాలు సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. మరికొందరు మైనర్‌లను మోసం చేయడం, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరక సంబంధాలు పెట్టుకోవడం, తర్వాత బెదిరింపులకు పాల్పడడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు భారతదేశం అత్యంత కఠినమైన చట్టాలలో ఒకటైన పోక్సోను అమలు చేస్తున్నది. ఈ చట్టం పిల్లలపై జరిగే లైంగిక నేరాలను, ప్రత్యేకంగా నిర్వచించి, బాధితులకు రక్షణ కల్పించడమే కాకుండా, నిందితులకు కఠిన శిక్షలు విధించే విధంగా ఉంటుంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) అమల్లోకి వచ్చిన తర్వాత కూడా నిబంధనలు స్పష్టతతో కొనసాగుతున్నాయి. భారత చట్టాల ప్రకారం 18 ఏండ్ల వయస్సు నిండని బాలబాలికలను మైనర్‌గా పరిగణిస్తారు. మైనర్‌లపై జరిగే లైంగిక దాడుల కేసులను పోలీసులు ఈ చట్టం ప్రకారం నమోదు చేస్తారు. పోక్సో చట్టం ప్రకారం మైనర్ సమ్మతితో లైంగిక సంబంధం కలిగి ఉన్నప్పటికీ అత్యాచారం కిందనే పరిగణిస్తారు. ఎందుకంటే శారీరక, మానసిక, సామాజిక భద్రతను అర్థం చేసుకునే స్థితిలో మైనర్‌లు ఉండరని చట్టం భావన.

2012లో భారత ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకొచ్చింది. పిల్లల రక్షణ, వేగవంతమైన విచారణ, బాధితులకు మానసిక భరోసా, గోప్యత పరిరక్షణ, నిందితులకు కఠిన శిక్షలు ఈ చట్టం ప్రధాన లక్ష్యాలు. ఇది సాధారణ క్రిమినల్ చట్టాలకు భిన్నంగా, ప్రత్యేకంగా చిన్నారుల భద్రత కోసం రూపొందించిన చట్టం. పోక్సో చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం మైనర్‌తోశారీరక సంబంధం పెట్టుకోవడం నేరం. ఈ నేరానికి కనీసం పదేండ్లపాటు జైలుశిక్ష లేదా జీవితఖైదు, జరిమానా ఉంటాయి. కేసు తీవ్రతను బట్టి కోర్టులు శిక్షను నిర్ణయిస్తాయి. పదేపదే దాడి చేయడం, బెదిరింపులు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేయడం, మైనర్ గర్భం దాల్చడం, నమ్మకాన్ని దుర్వినియోగం చేయడం వంటి సందర్భాల్లో కేసు సెక్షన్ 5 కింద నమోదవుతుంది. ఈ నేరానికి కనీసం 20 ఏండ్లపాటు జైలు, లేదా జీవిత ఖైదు, అత్యంత తీవ్రమైన సందర్భాల్లో మరణదండన వరకు శిక్ష పడుతుంది. పోక్సో చట్టం ప్రకారం అసభ్యకరమైన సందేశాలు పంపడం, న్యూడ్ ఫొటోలు పంపాలని అడగడం, ఫోన్, సోషల్ మీడియాలో వేధించడమూ నేరమే. ఇలాంటి నేరాలకు మూడేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటాయి.

పెండ్లి చేసుకుంటానని అబద్ధపు హామీ ఇచ్చి శారీరక సంబంధం పెట్టుకోవడాన్ని కూడా చట్టం తీవ్రమైన అంశంగా పరిగణిస్తుంది. చాలా సందర్భాల్లో బాధితులు ఫిర్యాదు చేయకుండా ఉండేందుకు నిందితులు బెదిరింపులకు పాల్పడుతారు. వీటిని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది. పోక్సో కేసులు సాధారణంగా నాన్ బెయిలబుల్. పోలీసులు కోర్టు వారంట్ లేకుండానే నిందితుడిని అరెస్ట్ చేయవచ్చు. చట్టపరమైన విచారణలో సాక్ష్యాలు చాలా కీలకం. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ సందేశాలు, కాల్ రికార్డింగ్స్, ఫొటోలు, వీడియోలు, ఒకవేళ బాధితురాలు గర్భం దాల్చితే మెడికల్ రిపోర్ట్స్, సాక్షుల స్టేట్‌మెంట్స్, హోటల్/ట్రావెల్ రికార్డ్స్, సీసీ కెమెరా దృశ్యాలు కేసులో ఆధారాలుగా ఉపయోగపడుతాయి. డిజిటల్ ఆధారాలు ఇప్పుడు కోర్టుల్లో చాలా కీలకంగా మారాయి. బాధితురాలి వాంగ్మూలం మేజిస్ట్రేట్ ముందు నమోదు చేస్తారు. కేసు తీవ్రతను బట్టి నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి. పోలీసులు విచారణ పూర్తి చేసి పూర్తి ఆధారాలతో చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పిస్తారు. ప్రత్యేక కోర్టు విచారణ జరుపుతుంది.

చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. ఎవరి కుటుం బం, రాజకీయ నేపథ్యం, ఆర్థిక స్థితి ఏదైనా సరే చిన్నారులపై నేరాల విషయంలో వేగవంతమైన, నిష్పక్షపాత విచారణ జరగాల్సిందే. అదే సమయంలో, ఆరోపణలు వచ్చిన ప్రతి వ్యక్తి కూడా కోర్టులో తనను తాను రక్షించుకునే హక్కు కలిగి ఉంటారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి, బాధితురాలిని పెండ్లి చేసుకుంటానని చెప్పినా నేర తీవ్రత తగ్గదు. బాధితురాలు, నిందితుడి కులాలు ఒక్కటే కాబట్టి వారికి కులపెద్దలు పెండ్లి చేయాలనే ధోరణిలో ఇటీవల ఓ మంత్రి మాట్లాడటం నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుంది. ఆ తర్వాత తన ఉద్దేశం వివరణ ఇచ్చారు. సోషల్ మీడియా ఒకవైపు బాధితులకు వేదికగా మారుతున్నప్పటికీ, మరోవైపు విచారణపై ప్రభావం చూపే ప్రమాదం కూడా ఉన్నది. తప్పుడు సమాచారం, రాజకీయ ప్రచారం వంటి అంశాలు నిజానిజాలను మసకబార్చవచ్చు. కాబట్టి బాధ్యతాయుత జర్నలిజం, బాధితుల గోప్యత,కోర్టు ప్రక్రియ పట్ల గౌరవం చాలా ముఖ్యం. ప్రేమ అనే భావన పవిత్రమైనది. కానీఅదే పేరుతో మోసం, దోపిడీ, బ్లాక్‌మెయిల్, లైంగిక హింస జరగడం అత్యంత ప్రమాదకరం. ప్రత్యేకంగా మైనర్‌ల విషయంలో మానసిక ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావం, భయం వారి జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. అందుకే సమాజం మొత్తం కలిసి పిల్లల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలి. చిన్నారుల భద్రత కేవలం చట్టాల బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు,విద్యాసంస్థలు, మీడియా,ప్రభుత్వం, సమాజం అందరి బాధ్యత. అందరూ తమ బాధ్యత సక్రమంగా నిర్వర్తిస్తేనే పిల్లలకు భయంలేని భవిష్యత్తు నిర్మించగలం. ధర్మో రక్షతి రక్షితః

## నర్సాయిపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం..



కోడేరు: కోడేరు మండలం నర్సాయిపల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ ఖాజా బేగం అన్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి వసతి కూడా కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ భైరపు స్వామి, పంచాయతీ సెక్రెటరీ ప్రదీప్ గౌడ్, కోడేరు ఎంపీఓ, సీసీ, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ జంబుల బుచ్చారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యం యాదవ్, వార్డు సభ్యులు శ్రావణి పృథ్వీరాజ్, శేషమ్మ, చిట్టెకొండ ఆంజనేయులు, సురగౌని లక్ష్మి, మహిళా సంఘం అధ్యక్షురాలు అలివేలమ్మ, మాజీ వార్డు సభ్యులు వసంత వెంకటేష్, రామ్ రెడ్డి, పర్వతాలు, మాజీ డైరెక్టర్ గండు అర్జునయ్య, మాజీ ఎంపీటీసీ తాళ్ల రాములు, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి కాజా, రైతు వేదిక ఉపాధ్యక్షుల పాండయ్య, రాంబాబు, సాయిరాం, కౌశిక్, కల్మూరి రామస్వామి, నాగన్న, ఎజ్జు నాగయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన..

# అత్యంత దురదృష్టకరం

### బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ



దేవరకొండ, మే 13 : దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన అత్యంత దురదృష్టకరం అని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. పగలూ రాత్రి కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆయన దుయ్యబట్టారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్డీఏ ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి పేపర్ లీకైందన్నారు. 2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైంది అని ఆయన గుర్తు చేశారు. జాతీయ అర్హత పరీక్ష నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్న ఈ అసమర్థత విద్యార్థుల పట్ల శాపంగా మారిందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కేంద్ర సర్కారు తీవ్ర మానసిక క్షోభకు గురిచేసిందన్నారు. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలన్నారు. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలన్నారు.

## రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ : జిల్లాలో ధాన్యం కొనుగోలు తరలింపు విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయడంతో పాటు ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. మొక్కజొన్న, వరి ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన ధాన్యం గోదాములకు తరలింపు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే టోల్ ప్లాజాలు, చెక్‌పోస్టుల వద్ద ఖాళీ లారీలను గుర్తించి ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నామని తెలిపారు. అవసరానికి అనుగుణంగా మరిన్ని లారీలు సమకూర్చుకోవాలని సూచించారు. లారీలు సమకూర్చే ప్రాంతాలు, అన్‌లోడింగ్ కేంద్రాల వద్ద రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ తదితర శాఖల సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం సంచులు నిల్వ ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైతే స్థానిక కూలీలను హమాలీలుగా నియమించుకోవాలని తెలిపారు. 25 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో అన్‌లోడింగ్ పాయింట్లు ఉన్న కేంద్రాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ గోదాములతో పాటు ప్రైవేట్ గోదాములు, రైతు వేదికలు తదితర ప్రాంతాల్లో కూడా ధాన్యం నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్తిగా సహకరిస్తాం.. ఎస్పీ జానకి షర్మిల

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న ధాన్యం తరలింపు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేందుకు పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాలు, ఇతర తనిఖీ కేంద్రాల్లో తగిన పోలీసు సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. రైతుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఎస్పీ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారులు, మేనేజర్లు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వద్ద రోడ్డు ప్రమాదం..

# బాలుడు మృతి, 10 మందికి గాయాలు



మహబూబ్ నగర్: మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిన్న చింతకుంట మండలం దమజ్ఞాపూర్ గ్రామం నుండి పాత మొల్గర గ్రామానికి పెళ్లి వేడుకకు హాజరై తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి మహబూబ్ నగర్ కలెక్టరేట్ ముందు పల్టీలు కొట్టింది. ఈ భీకర ప్రమాదంలో వాహనంలో ఉన్న ఒక చిన్న బాలుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పెళ్లి వేడుకలో వెల్లివిరిసిన సంతోషం కాస్తా ఒక్కసారిగా విషాదంగా మారింది. ఈ ప్రమాదంలో చిన్నారి మృతి చెందడంతో పాటు మరో 10 మంది వరకు తీవ్రస్థాయిలో గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి, క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఒకే కుటుంబానికి చెందిన వారు ప్రమాదానికి గురికావడంతో దమజ్ఞాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియవలసి ఉంది.




## వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త
# రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది.

ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ. 25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ. 15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.

'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కుచాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈచిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కమల్-రజనీ మూవీలో త్రిష



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది.

దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

# 70లోనూ యంగ్ హీరోలకు పోటీ.. చిరంజీవి న్యూ లుక్



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి వయసు పెరుగుతున్న కొద్దీ మరింత యంగ్‌గా కనిపిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. 70 ఏళ్ల వయసులోనూ అదే ఎనర్జీ, అదే గ్లామర్‌తో కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు చిరు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఆయన సినిమా భారీ విజయాన్ని అందుకుని బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపింది. దాదాపు రూ. 400 కోట్ల వసూళ్లతో మెగాస్టార్ మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు కేఎస్ రవీంద్ర దర్శకత్వంలో చిర నటిస్తుండగా, ఈ సినిమా కోసం చిరంజీవి పూర్తిగా కొత్త మేకోవర్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలు దీనికి నిదర్శనంగా మారాయి. లేత తెలుపు రంగు పోలో షర్ట్‌లో చిరంజీవి ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. స్లిమ్ ఫిట్ లుక్, యంగ్ స్టైల్‌తో ఆయన తన వయసులో సగం ఉన్నట్లుగా కనిపిస్తూ అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు "చిరంజీవి వయసు రివర్స్‌లో వెళ్తుందా?" అంటూ కామెంట్లు పెడుతున్నారు. చిరంజీవి ఫిట్‌నెస్ వెనుక ఉన్న క్రమశిక్షణ కూడా ప్రత్యేకమే. ఆయన దృష్టిలో ఫిట్‌నెస్ అంటే కేవలం శారీరక దృఢత్వం మాత్రమే కాదు, మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమని భావిస్తారు. అందుకే ఎప్పుడూ స్ట్రెస్ ఫ్రీగా, ప్రశాంతంగా కనిపిస్తుంటారు. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా ఎంతో జాగ్రత్తగా ఉంటారు. ఎక్కువగా వెజిటేరియన్ హై ప్రోటీన్ ఫుడ్, సలాడ్స్, సూప్స్ తీసుకుంటారని సమాచారం. షూటింగ్ ఎక్కడ ఉన్నా ఇంటి నుంచే భోజనం తెప్పించుకోవడం ఆయన అలవాటు.

అలాగే ప్రతిరోజూ వర్కవుట్స్, యోగా, ప్రాణాయామం తప్పకుండా చేస్తుంటారు. ఉదయం 4 గంటలకే లేచి రెండు గంటల పాటు వ్యాయామం చేసిన తర్వాతే ఇతర పనుల్లో పాల్గొంటారని సినీ వర్గాలు చెబుతున్నాయి. పాత్రకు తగ్గట్లుగా తనను తాను మార్చుకోవడంలో చిరంజీవి ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. ఇక బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ సినిమాకు 'కాకా' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అలాగే మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు ఫిలింనగర్‌లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం చిరంజీవి న్యూ లుక్ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా, అభిమానులు మెగాస్టార్ స్టైల్, ఫిట్‌నెస్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# భస్మ హారతిలో పాల్గొన్న తమన్నా



స్టార్ హీరోయిన్స్ ఎంత గ్లామర్ రంగంలో ఉన్నా కూడా భక్తిమార్గాన్ని వదలరు. తమ పనుల్లో బిజీగా ఉన్నా కూడా ఖాళీ చేసుకొని మరీ దైవదర్శనాలు చేస్తూ ఉంటారు. తాజాగా అందాల మిల్కీ బ్యూటీ తమన్నా సైతం ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపుతోంది. తనదైన ఎనర్జీతో యూత్‌నుఆకట్టుకుంటున్న స్టార్‌హీరోయిన్, భక్తిమార్గంలో అడుగులు వేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా తమన్నా ఉజ్జయిని మహాకాళేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంది. తెల్లవారుజామున జరిగే అతి పవిత్రమైన భస్మహారతిలో ప్రత్యక్షంగా పాల్గొని, మహాకాలుడికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. సంప్రదాయబద్ధమైన ఎరుపు చీరలో ఆలయనియమాలన్నీ కఠినంగా పాటిస్తూ, భక్తితో మహాకాలుడిని దర్శించుకుంది. తమన్నాను అక్కడ చూసినవారంతా ఆశ్చర్యపోయారు. నిర్మాత ప్రజ్ఞా కపూర్‌తో కలిసి తమన్నా ఆలయానికి వచ్చింది. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు.. ఆయన పిలుపు అందినప్పుడే మనం ఈ క్షేత్రానికి వస్తాము. స్వామివారి దర్శనం తనకు ఎంతో ప్రశాంతతను, ఆధ్యాత్మిక శక్తిని ఇచ్చింది అని చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్ క్వీన్‌కి భక్తి కూడా ఎక్కువే అంటూ నెటిజన్లు, ఫ్యాన్స్ ప్రశంసలతో ముంచేస్తున్నారు. ఇక ఆలయం విషయానికి వస్తే... ఉజ్జయిని మహాకాల్ ఆలయంలో ప్రతి రోజు తెల్లవారుజామున జరిగే ఈ భస్మ హారతి హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన క్రతువు. పవిత్ర భస్మతో శివలింగాన్ని అభిషేకం చేయడం ద్వారా జననం, మరణం, పునర్జన్మ అనే కాలచక్రాన్ని సూచిస్తారు. ఈ హారతిలో పాల్గొనడం వల్ల మనసుకు, ఆత్మకు లోతైన శాంతి లభిస్తుందని భక్తుల విశ్వాసం.

# కార్తీ సినిమాకు మరో తెలుగు దర్శకుడు



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్‌తో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రంలో కార్తీకి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా షూటింగ్ కొనసాగుతోంది. కాగా ఈ చిత్రానికి మరో దర్శకుడు పనిచేయబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. మిరాయి, ఈగల్ సినిమాలను డైరెక్ట్ చేసిన కార్తీక్ ఘట్టమనేని ఈ మూవీకి సినిమాటోగ్రఫీ చేయబోతున్నాడు. దీంతో కార్తీక్ ఘట్టమనేని ఇక సినిమాటోగ్రఫర్ కమ్ డైరెక్టర్‌గా మారిపోయాడన్నమాట. టాలీవుడ్‌లో 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్'చిత్రాలతో సూపర్ హిట్స్‌అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్ కార్తీతో కమర్షియల్ ఎంటర్‌టైనర్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీపై అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్, కళ్యాణ్ శంకర్ మార్క్ హ్యూమర్ టచ్‌తో రాబోతున్నఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

## చిరంజీవి సినిమాల్లో రెండు సార్లు ఆఫర్లు వచ్చినా వదులుకున్నా: ఇంద్రజ



90వ దశకంలో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన ఇంద్రజకు మెగాస్టార్ చిరంజీవి పక్కన నటించాలనే కోరిక బలంగా ఉండేదట. ఆమె కోరుకున్నట్టుగానే చిరంజీవితో నటించే అవకాశం ఆమెకు రెండు సార్లు వచ్చింది. అయితే, చిరంజీవి పక్కన ఛాన్స్ వచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. మొదటిసారి ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అల్లుడా మజాకా' సినిమాలో చిరంజీవి చెల్లెలి పాత్ర కోసం ఆమెను సంప్రదించారు. కానీ, చిరంజీవి పక్కన హీరోయిన్‌గా నటించాలని లేదా కనీసం ఆయనతో కలిసి ఒక మాస్ సాంగ్‌లో స్టెప్పులు వేయాలని ఆశించిన ఇంద్రజ, చెల్లెలి పాత్ర కావడంతో ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించింది.

ఆ తర్వాత ఎడిటర్ మోహన్ దర్శకత్వంలో రూపొందిన 'హిట్లర్' సినిమాలో రాజేంద్ర ప్రసాద్ సరసన నటించే అవకాశం వచ్చింది. అయితే అప్పటికే మరో సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల డేట్స్ కుదరక ఆ ఛాన్స్‌ను కూడా వదులుకోవాల్సి వచ్చింది. ఇలా రెండు గొప్ప అవకాశాలు చేజారినందుకు ఇప్పటికీ చిన్న అసంతృప్తి ఉందని ఆమె చెప్పుకొచ్చింది.

# తెలంగాణలో ఎన్డీయే కూటమి..!

హైదరాబాద్, మే 13, : తెలంగాణలో ఎన్డీఏ కూటమి ఏర్పాటు కానుందా అంటే అవును అని జవాబు వస్తోంది. ఇప్పటివరకు చూస్తే అక్కడ మూడు ప్రధాన పార్టీలు రాజకీయం చేస్తూ వస్తున్నాయి. ఒక ప్రధాన పార్టీగా అధికారంలో కాంగ్రెస్ ఉంది, ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఉంది. అయితే మూడో పక్షంగా వెనకన బీజేపీ కనిపిస్తోంది. బీజేపీకి పశ్చిమబెంగాల్ తర్వాత తెలంగాణ మీద ఒక్కసారిగా ఆశలు అధికమవుతున్నాయి. దాంతో 2028 లో జరిగే ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కమలం జెండాను ఎగరవేయాలని బిజెపి కృత నిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలోనే పశ్చిమబెంగాల్ లో కొత్త ప్రభుత్వాన్ని బీజేపీ స్థాపించిన తర్వాత నేరుగా ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో ల్యాండ్ అయ్యారు. ఆయన తెలంగాణాకు వస్తూనే తన వ్యూహాలను అమలులో తెచ్చినట్లుగా చెబుతున్నారు. బీజేపీకి ఆంధ్రాలో ఎన్డీఏ మిత్రులుగా ఉన్న తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లని వారి ఇళ్లలోనే మోడీ వచ్చి కలిశారు. వాళ్లతో చాలా సేపు చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలలో వర్తమాన రాజకీయ విషయాలు చాలానే వచ్చేయని అంతా అనుకుంటున్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కూడా ఎన్డీఏ కూటమి ఏర్పాటు చేసి అధికారంలోకి రావాలన్నద్దే బీజేపీ పెద్దల లక్ష్యంగా కనిపిస్తోంది ఇక దానికి ముందు అంటే కొద్ది నెలల్లో జరగబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పోటీ పడాలని చూస్తోంది అని అంటున్నారు. అంటే ఇది లిట్మస్ టెస్ట్ లాంటిది అన్న మాట. మూడు పార్టీలకు జనాదరణ ఎలా ఉంది అన్నది ఈ ఎన్నికల్లో తెలుస్తుంది అని భావిస్తున్నారు. ఆంధ్ర పార్టీలుగా ముద్రపడ్డ జనసేన టిడిపిలను జిహెచ్ఎంసి ఎన్నికల్లో జనాలు కనుక ఆదరిస్తే ఖచ్చితంగా 2028 నాటికి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి పోటీకి తయారుగా ఉంటుంది అని అంటున్నారు. ఇక చూస్తే ఇప్పటివరకు తెలంగాణ బిజెపి నేతలకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన పార్టీ పెద్దలు ఇప్పుడు స్వయంగా తామే అన్నీ పర్యవేక్షించాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. ఎందుకంటే తెలంగాణ బిజెపి నేతలు పూర్తిస్థాయిలో పార్టీని బలోపేతం చేయలేకపోతున్నారు అన్న నిర్ణయానికి కేంద్ర పెద్దలు వచ్చినట్టుగా చెబుతున్నారుతెలంగాణాలో ఎవరితోనూ పొత్తులు వద్దు తామే సొంతంగా అధికారులను బిజెపిని తెస్తామని చెప్పిన కాషాయం నేతలు తలోదిక్కుగా విడిపోయి వర్గ పోరుని పెంచి పోషిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసే చర్యలకు దిగటం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నాళ్లు గడిచిన బిజెపి ప్రతిపక్షంలోనే వెనక సీట్ లోనే ఉంటుంది అని కేంద్ర పెద్దలు భావిస్తున్నారు. దాంతో గేర్ మార్చి స్పీడ్ పెంచాలని స్వయంగా నరేంద్ర మోడీ నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీని జనసేనను కలుపుకుంటే తెలంగాణ అంతటా క్షేత్రస్థాయిలో బిజెపికి అవసరమైన బలం సమకూరుతుందని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ని బీఆర్ఎస్ ని గట్టిగా ఢీ కొట్టి తాము అధికారంలో వచ్చేందుకు వీలు అవుతుందని బీజేపీ పెద్దలు నమ్మకంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో బీజేపీ పెద్దలు టీడీపీతో పొత్తుల విషయంలో తెలంగాణ బిజెపి నేతల సూచనలు కాని వాళ్ళ అభ్యంతరాలను కానీ పట్టించుకునే అవకాశాలు ఏమాత్రం కనిపించట్లేదు. చంద్రబాబుతో పొత్తు వద్దు అని తెలంగాణ బిజెపి నేతలు గతంలో చెప్పి ఉన్నా కానీ ఇప్పుడు ఆ పరిస్థితి అయితే లేదు. కేంద్ర బీజేపీ నేతలు చంద్రబాబుతోనూ పవన్ తోనూ పొత్తుకు కుదిరించే పనిలో ఉన్నారని అంటున్నారు. దాంతో తెలంగాణలోనూ ఎన్డీఏ కూటమి రాబోయే ఎన్నికలకు సంసిద్ధమైన సూచనలు స్పష్టంగా కనిపిస్తుంది దీంతో తెలంగాణ రాజకీయంలో పెను మార్పులు సంభవిస్తాయని అంతా అంటున్నారు.

## ఎర్రుపాలెం నూతన తాసీల్దార్‌గా సునీత ఎలిజబెత్ బాధ్యతల స్వీకారం



ఎర్రుపాలెం, మే 13 : ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల నూతన తాసీల్దార్‌గా శ్రీమతి కె.సునీత ఎలిజబెత్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖమ్మం కలెక్టరేట్ నుండి ఎర్రుపాలెంకు వచ్చిన ఆమె తాసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వకంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా చేరవేసే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

## ప్రతి పంటను తరుగు లేకుండా కొనుగోలు చేయాలి

### ముత్యాల విశ్వనాథం



చుంచుపల్లి, మే 13 : రైతులు పండించిన ప్రతి పంటను ఎలాంటి తరుగు లేకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో 5 కేజీల వరకు తరుగు తీస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇది రైతులకు నష్టాన్ని కలిగిస్తోందన్నారు. అలాగే వ్యవసాయ అధికారులు ఎఫ్ఏక్యూ ప్రమాణాలు వచ్చిన వడ్లనే కొనుగోలు చేయాలనే నిబంధనను ఎత్తివేసి గతంలో మాదిరిగానే తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరారు. పీఆర్ రకాలకు చెందిన వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఈ విషయంలో అధికారులు మిల్లర్లతో చర్చించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సమయానికి లారీలు అందుబాటులో లేకపోవడం, హమాలీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. ఐకెపి సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడం వల్ల కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతోందని, అనుభవం ఉన్న సిబ్బందితో కొనుగోలు బాధ్యతలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రైతులను కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా వెంటనే ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లర్లకు తరలించాలని కోరారు. లేకపోతే వర్షాలు, గాలివానల వల్ల ధాన్యం తడిసి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సలిగంటి శ్రీనివాస్, సర్పంచ్ కారం సీతారాములు, రైతులు అజ్గర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపుడిలో వంతెన ప్రారంభం

- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించిన పొన్నెకంటి కుటుంబ సభ్యులు అభినందనీయులు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





జూలూరుపాడు, మే 13 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని గుండెపుడి గ్రామంలో ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ నూతనంగా నిర్మించిన వంతెనను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ప్రారంభించారు. సుమారు రూ.7 లక్షల వ్యయంతో గ్రామంలోని ప్రజల అవసరాల కోసం ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామస్తుల సౌకర్యం కోసం వంతెన నిర్మించాలని పొన్నెకంటి కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎంతో అభినందనీయమని కొనియాడారు. సమాజం పట్ల బాధ్యతతో, సేవా దృక్పథంతో సొంత నిధులను వెచ్చించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావడం గొప్ప విషయమని ఆయన ప్రశంసించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు కాళ్లూరు వెంకటేశ్వరరావు, కొమ్మిని పాండురంగారావు, దుద్దుకూరి సుమంత్, కొమ్మిని నాగేశ్వరరావుతో పాటు పలువురు గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అసమర్ధ పాలనతో ఆర్థిక వ్యవస్థ కుదేలు

### జూలకంటి రంగారెడ్డి




దామరచర్ల, మే 13 : కేంద్రంలో మోడీ అసమర్థ పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు అయిందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆదాయాలు తగ్గిపోయి కార్పొరేట్ సంస్థల పెట్టుబడులు, లాభాలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయన్నారు, వేల కోట్ల రూపాయల అప్పు చేస్తూ విదేశీ స్వదేశీ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దారాదత్తం చేస్తున్నారని, ప్రజలకు అవసరమైన మౌలిక సమస్యలను పట్టించుకోవడం లేదని, రైతులు కార్మికులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను అమలుకు శ్రీకారం చుట్టిన మోదీ నీతి బోధనలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు, డీజిల్ పెట్రోల్ వాడకం తగ్గించాలని సూక్తులు చెపుతున్న మోదీ మాత్రం రోడ్ షోలతో విపరీతంగా వాహనాలను వాడుతూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం అందించే సహకారంతోనే నేడు దేశంలోనే అంబానీ, అదానీ సంపద రోజురోజుకు పెరగడం వాస్తవం కాదా అన్నారు. మోదీ అసమర్థమైన పాలనతోనే ఇవాళ దేశంలో సామాన్య ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. దేశంలోనే అన్ని వర్గాల ప్రజలు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు రవి నాయక్, మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్, కమిటీ సభ్యులు దయానంద్, కరీం మున్నీషా పాల్గొన్నారు.

## టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో..

# యువతకు ఉపాధి అవకాశాలు



మందమర్రి : నైపుణ్యాభివృద్ధి, భాషా శిక్షణ, వృత్తిపరమైన శిక్షణ ద్వారా స్థానిక యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించడం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ప్రధాన లక్ష్యమని గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు జూన్ 10, 2026 నుంచి ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. బుధవారం మంచిర్యాల జిల్లా మందమర్రిలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జర్మనీ జాబ్ ట్రైనింగ్ క్యాంప్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్‌కు అవసరమైన మౌలిక వసతులు, శిక్షకులు, తగిన బడ్జెట్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విదేశీ ఉద్యోగాల పై ఆసక్తి ఉన్న యువతతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఐటీఐ, ఏటీసీ, అప్రెంటిస్‌షిప్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. జర్మనీ మాత్రమే కాకుండా ఇజ్రాయెల్, గ్రీస్, జపాన్ వంటి దేశాల్లో కూడా నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇటీవల తెలంగాణకు చెందిన యువతలో ఒక బృందం ఇజ్రాయెల్‌లో నిర్మాణ రంగానికి సంబంధించిన ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిందన్నారు. వారికి త్వరలోనే ఆకర్షణీయమైన వేతనాలతో అక్కడ ఉద్యోగాలు కల్పించబడతాయని మంత్రి వివేక్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో టామ్‌కామ్‌కు సమృద్ధిగా నిధులు కేటాయించారని, దీంతో సంస్థ పెద్ద ఎత్తున శిక్షణ, నియామక కార్యక్రమాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తన జర్మనీ పర్యటన సందర్భంగా అక్కడ ఉద్యోగాల్లో ఉన్న తెలంగాణ యువతను కలుసుకుని వారి పని పరిస్థితులు, అనుభవాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నానని డా. వివేక్ వెంకటస్వామి చెప్పారు. మేసన్రీ, ఫార్మసీ, హాస్పిటాలిటీతో పాటు పలు సాంకేతిక రంగాల్లో ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉందన్నారు. విదేశీ ఉద్యోగాల కోసం ప్రైవేట్ ఏజెన్సీల కంటే టామ్‌కామ్‌ను ఆశ్రయించాలని విద్యావంతులైన యువతకు మంత్రి సూచించారు. ఉద్యోగ అవకాశాలు నిర్ధారించిన తర్వాత మాత్రమే టామ్‌కామ్ అభ్యర్థులను విదేశాలకు పంపుతుందని ఆయన స్పష్టం చేశారు. జర్మన్ భాష పై పట్టు సాధిస్తే జర్మనీలో ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయని, అందుకోసం టామ్‌కామ్ ప్రత్యేక జర్మన్ భాషా శిక్షణను కూడా అందిస్తున్నదని తెలిపారు. ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ, పీజీ వరకు విద్యార్హతలు కలిగిన యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, జీఎం రాధాకృష్ణ, ఎమ్మార్వో సతీష్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి: అడిషనల్ కలెక్టర్




చొప్పదండి: ప్రభుత్వ పాఠశాలల విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్వని తానాజీ వాకడే అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జవహర్ నవోదయ విద్యాలయంలో చొప్పదండి మండల విద్యాధికారి జ్యోతి ఆధ్వర్యంలో చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాల సర్పంచ్ లు, మున్సిపల్ పాలకవర్గ ప్రజాప్రతినిధుల విద్యా వారోత్సవాల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ అశ్వని తానాజీ వాకడే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితో సాధ్యమవుతుందని అన్నారు.

అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి..: మౌళిక వసతులు కల్పించి గ్రామీణ ప్రాంత విద్యావ్యవస్థను పటిష్ఠం చేయాలని బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్‌లను ప్రజాప్రతినిధులను కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. అందుకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. అందుకు అనుగుణంగా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థుల నృత్యాలు అలరించాయి. నవోదయ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్ పెరుమాండ్ల మానస, కౌన్సిలర్ లు, కమీషనర్ నాగరాజు, మూడు మండలాల ఎంఈఓ ,తహసీల్దార్ ఎంపీడీఓ, సర్పంచ్‌లు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం..

### ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నాంపల్లి: మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరాముడి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్థులు ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, గ్రామ సర్పంచి జంపాల లక్ష్మీ సైదులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఏడు దొడ్ల రవీందర్ రెడ్డి, పూల వెంకటయ్య, శ్రీనివాస్ గ్రామ పెద్దలు, భక్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com